అభివృద్ధి అంటే చంద్రబాబు, విధ్వంసం అంటే జగన్ అని ప్రజలకు తెలుసు. అమరావతిని నాశనం చేసి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారు. రైతులను నష్టపరిచి పెట్టుబడిదారులను పారగొట్టిన జగన్, ఇప్పుడు "మావిగన్" పేరుతో మరోసారి ప్రజలను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారు.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 22.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక


సంపుటి - 34 సంచిక - 30 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఏపీ పారిశ్రామిక గర్జన

## రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు!


- ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా ప్రాజెక్టుల గ్రౌండింగ్
- 2028 చివరినాటికి ప్రాజెక్టులు ప్రారంభించేలా కార్యాచరణ
- మంత్రుల కమిటీ, అధికారులకు లక్ష్యం నిర్దేశించిన సీఎం
- పెట్టుబడిదారులకు సింగిల్ పోర్టల్ ద్వారా సేవలు
- భూ కేటాయింపుల్లో పర్యాటక ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యం
- గోవా ప్లస్‌గా సూర్యలంక బీచ్ - త్వరలో బాపట్ల మాస్టర్ ప్లాన్
- 23 నెలల్లో ఏపీకి 756 ప్రాజెక్టులు, రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు
- రాష్ట్ర యువతకు 21.20 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు
- ఎంఓయూలు, ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల గ్రౌండింగ్ ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా జరగాలని, డిసెంబర్ 2028 కల్లా ప్రారంభమయ్యేలా చూడాలని మంత్రుల కమిటీ, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రం అనుసరిస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ఆచరణలో చూపాలన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఓయూల స్థితిగతులు, ప్రాజెక్టుల పురోగతిపై ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. మంత్రుల కమిటీ తీసుకున్న చర్యలు, ప్రస్తుత కార్యాచరణ, మిగతా 2లో...

## బక్రీద్ సెలవు 28కు మార్పు



- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 27వ తేదీ బుధవారం ప్రకటించిన సాధారణ సెలవును 28వ తేదీ గురువారానికి మారుస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ జీఓఆర్టీ నెం.1006 ద్వారా ఆదేశాలు వెలువరించారు.
నెలవంక దర్శనంపై ఆధారపడి ముస్లిం సమాజం బక్రీద్ వేడుకలను ఈనెల 27కు బదులుగా 28వ తేదీ గురువారం నిర్వహించనున్నట్లు విజయవాడ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మిగతా 2లో...

## రెన్యూవబుల్ ఎనర్జీలో పెట్టుబడుల ప్రవాహం



- కడప జిల్లాలో ఎస్ఏఈఎల్ సోలార్ ప్లాంట్ల నిర్మాణం
- 600 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను నిర్మించిన ఎస్ఏఈఎల్
- రూ.3వేల కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగాల కల్పన
- నేడు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ప్రారంభించనున్న మంత్రి నారా లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రెన్యూవబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి పెట్టుబడులు తరలివస్తున్నాయి. ప్రముఖ గ్రీన్ ఎనర్జీ సంస్థ ఎస్ఏఈఎల్ సోలార్ పవర్ కంపెనీ కడప జిల్లాలో తన అనుబంధ విభాగాల ద్వారా రెండు ప్రాంతాల్లో 600 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను స్థాపించింది. కొండాపురం, పెద్దముడియం మండలాల్లో రెండు సోలార్ ప్లాంట్లను 300 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మాణం పూర్తిచేసింది. కొండాపురం మండలం టి.కోడూరు వద్ద సోలార్ విద్యుత్ ప్లాంట్ ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రేపు ప్రారంభించనున్నారు. పెద్దముడియంలోని మరో ప్లాంట్ ను వర్చువల్ గా ప్రారంభిస్తారు.

**రూ.3వేల కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగాల కల్పన :** ఎస్ఏఈఎల్ సోలార్ పవర్ కంపెనీ రూ.3వేల కోట్ల పెట్టుబడితో రెండు ప్రాంతాల్లో 600 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లను నిర్మించడం జరిగింది. తద్వారా 500 మందికిపైగా ఉద్యోగ, మిగతా 3లో...


## 'జనతా వారధి'తో ప్రజలకు అండగా బీజేపీ

- 'మీ సమస్య.. మా బాధ్యత'తో ప్రజా సమస్యల పరిష్కారంలో బీజేపీ ముందడుగు
- ప్రజల కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బీజేపీ
- ప్రతి వారం ప్రజలకు భరోసాగా బీజేపీ 'జనతా వారధి'
- 3,248 అర్జీలు స్వీకరణ.. 2,180 సమస్యలకు పరిష్కారం
- ప్రతి జిల్లాలో "జనతా వారధి"కి పెరుగుతున్న ఆదరణ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీయన్ మాధవ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి కార్యాచరణతో ముందుకు సాగుతున్న కార్యక్రమంగా "జనతా వారధి" రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందుతోందని ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ తెలిపారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, బాధితులకు భరోసా కల్పించే దిశగా "జనతా వారధి" విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత చేరువగా ఉండే లక్ష్యంతో మిగతా 2లో...


## దేవుడి సొత్తుకే ఎసరు



- కోటి రూపాయల కిరీటం ప్రైవేట్ వ్యాపారి వద్ద తాకట్టు!
- ఆలయంలో వెంకటేశ్వరస్వామి కిరీటం మాయం: పరారీలో 31 మంది బోర్డు సభ్యులు

**గుడివాడ (జర్నలిస్ట్ ఫైల్) :** కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తీవ్ర కలకలం రేగింది. స్వామివారికి అలంకరించే దాదాపు కోటి రూపాయల మార్కెట్ విలువ కలిగిన అత్యంత అమూల్యమైన బంగారు కిరీటం మాయమైంది. మిగతా 2లో...

## స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు



- 20 తీర్మానాలను చేపట్టాలని టీడీపీ పొలిట్ బ్యూరోలో నిర్ణయం
- పండుగలా మహానాడు నిర్వహించాలన్న టీడీపీ అధినేత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహానాడు- 2026ను స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ పొలిట్ బ్యూరో నిర్ణయించింది. 20 తీర్మానాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. గురువారం పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్‌గా జరిగిన ఈ పొలిట్ బ్యూరో భేటీలో సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పాల్గొనగా... వేర్వేరు ప్రదేశాల నుంచి మిగిలిన పొలిట్ బ్యూరో సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో మహానాడు నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. ఏయే తీర్మానాలు ప్రవేశపెట్టాలి... తీర్మానాల్లో సారాంశం ఏ విధంగా ఉండాలి.. వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేశారు. మిగతా 3లో...

## గురుకుల విద్యార్థులకు 'క్రీడా' ప్రోత్సాహం



- బీసీ గురుకుల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్లు
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యతో పాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని, దీన్ని దృష్టిలో పెట్టుకునే బీసీ గురుకులాలు విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్, షూస్ అందజేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగించడంతో పాటు వాటిలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ముగ్గురు క్రీడాకారులు - 3లో...

## విలువల్లేని నేర రాజకీయాలు జగన్ సొంతం

- జగన్ 'జంగిల్ రాజ్'ను ప్రజలు మర్చిపోరు
- తండ్రి రాజశేఖర్ రెడ్డి మరణంతో లబ్ధి ఎవరికి?
- నేర రాజకీయాలపై పూర్తి ఆత్మ రక్షణలో జగన్‌రెడ్డి
- అమరావతి నిర్మాణంతో రోజురోజుకీ బీపీ పెంచుకుంటున్న మాజీ సిఎం జగన్ రెడ్డి
- విశాఖలో జగన్ మహల్ నిర్మాణానికి పెట్టిన ఖర్చెంత?
- కల్తీ మద్యం అమ్మిన వారి పట్ల మానవత్వమా?
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే సంతానమే సంపద విధానం
- జగన్ రెడ్డిపై వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజం

3 లో




## గనుల రంగ అభివృద్ధికి పటిష్ట చర్యలు



**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్) :** గనుల రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ఇసుక సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర గనుల, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. మిగతా 3లో...

## మంత్రి అచ్చన్న సంకల్పం

## టెక్కలిలో ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం



**ఎడిటర్స్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** నిర్లక్ష్యంలో మగ్గిన పట్టుమహాదేవి కోనేరు ఇప్పుడు నవచైతన్యానికి చిరునామాగా మారనుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంకల్పంతో టెక్కలి నియోజకవర్గ కేంద్రంలో చారిత్రాత్మక కోనేరు పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. అభివృద్ధి అంటే కేవలం హామీలు కాదు, ప్రజల జీవితాల్లో కనిపించే మార్పు కావాలని నమ్మే నాయకుడిగా మంత్రి అచ్చెన్నాయుడు మరోసారి తన ప్రత్యేకతను చాటుతున్నారు. మిగతా 2లో...



- మంత్రి అచ్చెన్నాయుడు సంకల్పంతో ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా పట్టుమహాదేవి కోనేరు
- కోనేటి వాకిట కొంగొత్త వెలుగు.. కోనేరు మధ్యలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో అభివృద్ధి పథంలో టెక్కలి నియోజకవర్గం
- రెండు దశల్లో అభివృద్ధి పనులు.. పచ్చందనాలు పరుచుకునే ప్రణాళిక

## భూ రికార్డులకు 'డిజిటల్' భద్రత

- చకచకా 22ఎ నిషేధిత జాబితా భూములకు విముక్తి
- ఇప్పటికే 1.6 లక్షల ఎకరాలపై రైతులకు శాశ్వత హక్కులు
- మరో 1.9 లక్షల ఎకరాల చుక్కల భూములకు త్వరలో మోక్షం
- లక్షల ఇంటి స్థలాలు, ఇళ్ల పట్టాలపై నిషేధం ఎత్తివేత
- పట్టణ ప్రాంతాల్లో 10 వేల పేదల గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణ
- త్వరలో మరో 25 వేల గృహాలకు మోక్షం
- పేదలకు అనుకూలంగా ఫ్రీ హోల్డ్ భూములపై నిర్ణయం

2 లో

# 'జనతా వారధి'తో ప్రజలకు అండగా బీజేపీ



(మొదటి పేజీ తరువాయి)

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "జనతా వారధి" కార్యక్రమాన్ని ఈ ఏడాది జనవరి 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ తెలిపారు.

ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వం-కు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా వినతులు, ఫిర్యాదులు, సమస్యలు, అర్జీలు స్వీకరించి వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం అందిన అర్జీలను సోమవారం ఆయా జిల్లాల అధికారులతో సమీక్షిస్తూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వం, అధికార వ్యవస్థ మధ్య వారధిగా నిలవడమే "జనతా వారధి" ప్రధాన ఉద్దేశ్యమని మాధవ్ వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,248 అర్జీలు స్వీకరించామని తెలిపారు. వీటిలో భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య సేవలు, విద్య, ఉపాధి, తాగునీటి సమస్యలు, రోడ్లు, రెవెన్యూ సంబంధిత అంశాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఇప్పటి వరకు అందిన అర్జీలలో సుమారు 2,180 సమస్యలు పరిష్కారమయ్యాయని, మరో 760 సమస్యలు వివిధ శాఖల పరిధిలో పరిష్కార దశలో ఉన్నాయని వెల్లడించారు. జనతా వారధి ద్వారా 486 పెన్షన్ సమస్యలు, 312 రేషన్ కార్డు సమస్యలు, 228 భూ మరియు రెవెన్యూ సమస్యలు పరిష్కార దశకు చేరుకున్నాయని తెలిపారు. అదేవిధంగా 174 తాగునీరు, మౌలిక వసతుల సమస్యలు, 142 విద్య, ఉపాధి సంబంధిత సమస్యలు, 96 ఆరోగ్య సేవలకు సంబంధించిన అర్జీలు పరిష్కరించబడ్డాయని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య సమన్వయ వారధిగా నిలవడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పీవీయన్ మాధవ్ తెలిపారు. "జనతా వారధి" కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని, ఇదే స్ఫూర్తితో ప్రతి వారం కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.


## బక్రీద్ సెలవు 28కు మార్పు

(మొదటి పేజీ తరువాయి)

దీనిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సెలవు తేదీని మార్చుతూ నిర్ణయం తీసుకుంది.

దీంతో ఈనెల 27వ తేదీ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని సీఎస్ సాయి ప్రసాద్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అదేవిధంగా షాపులు, ఇతర ఎస్టాబ్లిష్‌మెంట్లకు సంబంధించిన నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్-1881 ప్రకారం ప్రకటించిన బక్రీద్ సాధారణ సెలవును కూడా 27వ తేదీ బుధవారం నుంచి 28వ తేదీ గురువారానికి మారుస్తూ జీఓఆర్టీ నెం. 1007 ద్వారా ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

# దేవుడి సొత్తుకే ఎసరు



(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘోర అపచారం రాష్ట్రవ్యాప్తంగా భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరచడంతో, దేవదాయ శాఖ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని ఉన్నత స్థాయి విచారణకు శ్రీకారం చుట్టింది. మరోవైపు, స్వామివారి కిరీటం మాయమైన ఉదంతం వెలుగులోకి రాగానే ఆలయ పాలక మండలి (ట్రస్ట్ బోర్డు) సభ్యులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. విచారణకు భయపడి ట్రస్ట్ బోర్డుకు చెందిన మొత్తం 31 మంది సభ్యులు తమ ఫోన్లు స్విచ్చాఫ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. అంతేకాకుండా, వారు వెళ్తూ వెళ్తూ దేవస్థానం నిర్వహణ ట్రస్ట్ కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లడం స్థానికంగా మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

**రంగంలోకి దేవదాయ శాఖ అధికారులు..:** ఈ దారుణ ఘటనపై సమాచారం అందుకున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత హుటాహుటిన ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడిని, ఇతర సిబ్బందిని ఆమె సుదీర్ఘంగా విచారించి వివరాలు సేకరించారు. దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ కార్యాలయం తాళాలను తెరిపించిన అసిస్టెంట్ కమిషనర్ లలిత.. ఆలయ ఆస్తులు, నగలకు సంబంధించిన కీలక రికార్డులను, లావాదేవీల పుస్తకాలను ఒక ప్రత్యేక గదిలో భద్రపరిచి, ఆ గదికి తాళాలు వేయించారు. ఆ రికార్డులన్నింటినీ తమ ఆధీనంలోకి తీసుకుని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. గత ఏడాది ఒక వృద్ధ దాత కుటుంబం ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ బంగారు కిరీటాన్ని స్వామివారికి కానుకగా సమర్పించింది. అయితే, ఇటీవల కాలంలో స్వామివారికి ఆ కిరీటాన్ని అలంకరించకపోవడంతో అనుమానం వచ్చిన దాతలు ఆలయ కమిటీని నిలదీశారు. మొదట లాకర్లలో ఉందని అబద్ధాలు చెప్పినప్పటికీ, గట్టిగా ప్రశ్నించడంతో తమ సొంత అవసరాల కోసం (ఆలయ పనుల నిమిత్తం) ఒక ప్రైవేట్ వ్యాపారి వద్ద రూ. 38 లక్షలకు ఆ కిరీటాన్ని అక్రమంగా తాకట్టు పెట్టినట్లు కమిటీ సభ్యులు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ సున్నితమైన అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, నివేదికను ప్రభుత్వ ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ లలిత మీడియాకు వెల్లడించారు. భగవంతుడి సొత్తును సైతం పక్కదారి పట్టించిన నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భక్తులు తీవ్రస్థాయిలో డిమాండ్ చేస్తున్నారు.

# ఏపీ పారిశ్రామిక గర్జన..



(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్ ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈ 23 నెలల్లో రూ. 21,64,258 కోట్ల విలువైన మొత్తం 756 ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని, వీటితో 21,20,567 ఉద్యోగాలు వస్తున్నట్టు తెలిపారు. ప్రైవేటు రంగంలో ఏవియేషన్ ప్రాజెక్టులను ఆకర్షించేలా చర్యలు చేపడతామని లోకేష్ చెప్పారు. పెట్టుబడుల సాధనలో దేశంలోనూ, ప్రైవేటు రంగంలోనూ ఏపీ పేరు మార్మోగుతోందని, ఎంఎస్ఎంఈల అనుమతులు, ఇతర వివరాలను త్వరలోనే వెబ్ సైట్ ద్వారా అందిస్తామని లోకేష్ తెలిపారు.

**21 ప్రధాన ఆలయాలతో టెంపుల్ టూరిజం సర్క్యూట్ :** ప్రాజెక్టుల గ్రౌండింగ్, అనుమతుల వివరాలు, ఉద్యోగాల కల్పనపై సింగిల్ పోర్టల్‌లో డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూ కేటాయింపుల్లో మొదటగా పర్యాటక ప్రాజెక్టులకు, తర్వాత ఐటీ కంపెనీలకు ప్రాధాన్యత కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. టూరిజం, ఐటీ లాంటి ప్రాజెక్టులకు వినూత్నంగా మల్టీ పర్పస్ భవనాల నిర్మాణం చేపట్టే ఆలోచన చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్ ను గోవా ప్లస్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేయాలని బాపట్ల బీచ్‌కు త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏపీలోని 21 ప్రధాన ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం ప్రాజెక్టు వేగంగా చేపట్టాలన్నారు. ఐటీ ప్రాజెక్టులు తమ కార్యకలాపాలు 18 నెలల్లో ప్రారంభించేలా చూడాలని స్పష్టం చేశారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ తయారీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**నౌకా నిర్మాణ రంగంలో విస్తృత అవకాశాలు :** ట్రాన్స్‌మిషన్‌తో పాటు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఏపీ నిర్దేశించుకున్న 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని వేగంగా చేరుకోవాలని సీఎం అన్నారు. అయితే ఇప్పటికే 99 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించేలా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు త్వరితగతిన ఏర్పాటయ్యేలా చూడాలని సీఎం అన్నారు. 2027 డిసెంబరు నాటికి 46 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించేలా నిరంతరం పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు చేయాలని సీఎం సూచించారు. షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణం, పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. నౌకా నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. గడచిన 30 ఏళ్లుగా ఏపీలో భూసేకరణ గురించి వివాదాలు ఏర్పడలేదని...రైతులకు, పరిశ్రమలకు, ప్రభుత్వానికి ప్రయోజనం కలిగేలా భూ సేకరణ ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.


**పర్యావరణ హితంగా ప్రాజెక్టులు :** 'రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో పర్యావరణ హిత టెక్నాలజీ వినియోగించాలని సీఎం సూచించారు. తీరప్రాంతాల్లో సముద్రంలోకి కాలుష్య కారకాలను విడిచిపెట్టకుండా చూడాలని అన్నారు. సూర్యలంక, నెల్లూరు మైపాడు వంటి బీచ్ ప్రాంతాల్లో పరిశుభ్రమైన పరిస్థితులు ఉండాలన్నారు. కాలుష్యాన్ని సముద్రంలోకి విడిచిపెడితే భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేసే విషయంలోనూ త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎంఎస్ఎంఈ రైట్ టూ బిజినెస్ యాక్ట్ వెంటనే అమల్లోకి తీసుకురావాలని .నమోదు చేసుకుని పరిశ్రమ ప్రారంభించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల్లో తయారయ్యే ఉత్పత్తులు నాణ్యతపై దృష్టి పెట్టాలని.. ప్రోడెక్టు పర్ఫెక్షన్ పై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలన్నారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ప్రాజెక్టులను సాకారం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం అన్నారు.

**ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో 114 గ్రౌండింగ్ :** రాష్ట్రంలో ఇప్పటివరకు రూ. 11.47 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి మొత్తం 282 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 4.32 లక్షల కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరం -- రూ. 4.72 లక్షల కోట్లు, 2026-27లో (ఈనెల వరకు) - రూ. 2.39 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటిలో ఇప్పటికే 114 గ్రౌండింగ్ అయ్యాయి. 2026 సెప్టెంబర్ నాటికి అన్ని ప్రాజెక్టుల గ్రౌండింగ్ లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇందుకోసం పర్యావరణం సహా ఇతర అనుమతులు, విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక వసతులు, భూముల రిజిస్ట్రేషన్, స్థానిక సమస్యల పరిష్కారం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. బీపీసీఎల్, ఇండోసోల్, శ్రీ సిటీ ఫేజ్-II వంటి ప్రాజెక్టులకు భూసేకరణ అత్యంత వేగంగా కొనసాగుతోందని, బీపీసీఎల్ ప్రాజెక్టుకు అవసరమైన సుమారు 3,000 ఎకరాల్లో 2,000 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కేవలం మూడు రోజుల్లో పూర్తి చేసినట్టు అధికారులు వివరించారు.

**అంశాల పరిష్కారానికి మంత్రుల కమిటీ కృషి :** పరిశ్రమల గ్రౌండింగ్ వేగవంతం కోసం మంత్రుల కమిటీ కృషి చేస్తుండగా, విదేశాల నుంచి రాష్ట్రంలో ఏర్పాటు చేసే పెట్టుబడుల వివరాలను ఈడీబీ సేకరిస్తోంది. అన్ని శాఖల పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఐటీ పోర్టల్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీ ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహిస్తోంది. ప్రాజెక్టుల వేగవంతమైన గ్రౌండింగ్ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు చేపట్టేలా చూడాలని మంత్రుల కమిటీకి సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మంత్రి అచ్చెన్న సంకల్పం... టెక్కలిలో ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)





టెక్కలి నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక, ఆధునిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధికి భారీ ప్రణాళికలు రూపొందించి ప్రజల్లో కొత్త ఆశలు నింపుతున్నారు. పచ్చదనం, సుందరీకరణ, ఆధునిక సౌకర్యాలు, ఆధ్యాత్మిక వైభవం కలగలిపిన అభివృద్ధి నమూనాతో టెక్కలి రూపురేఖలు మార్చేందుకు అచ్చెన్నాయుడు తీసుకుంటున్న చొరవ స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెక్కలి సొబగులు మారుతున్నాయనేందుకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ఉన్న పరిస్థితులను మార్చుతూ మంత్రి అచ్చెన్న కొత్త సంకల్పంతో ముందుకు సాగుతున్న వైనంపై ఇది ప్రత్యేక కథనం. లి

**మంత్రి అచ్చెన్న సంకల్పానికి నిదర్శనం :** ఒకప్పుడు దీనావస్థలో ఉన్న పట్టుమహాదేవి కోనేరు ఇప్పుడు ఆధ్యాత్మిక-పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెందనుంది. మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో 13 కోట్ల రూపాయల అభివృద్ధి నిధులు సాధించడం ఈ ప్రాంత ప్రజలకు శుభవార్తగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెక్కలి ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపు వచ్చిందని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.


**నిధుల కేటాయింపునకు అచ్చెన్న కృషి :** ఒకప్పుడు పట్టుమహాదేవి కోనేరు దీనావస్థలో ఉండేది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యం కారణంగా టెక్కలి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి అచ్చెన్న ఆధ్వర్యంలో ప్రతి చిన్న పనినీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అటు టెంపుల్ టూరిజంతో పాటు ఇటు పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు దూసుకుపోతోంది. గతంతో పోలిస్తే తమ ప్రభుత్వం మాటల కంటే చేతలకే ప్రాధాన్యం ఇస్తూ సరికొత్త చరిత్రకు నాంది పలుకుతోందని మంత్రి అచ్చెన్న పదేపదే నిరూపిస్తూ సత్తా చాటుతున్నారు. కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పాటు డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ సమష్టి కృషితో రాష్ట్రాభివృద్ధి వేగంగా సాగుతున్న వైనం తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు పట్టణ శోభను, పట్టణ ప్రాంతాలకు నగర శోభను తీసుకువస్తూ అభివృద్ధికి చొరవ చూపిస్తూ నిధుల కేటాయింపునకు కృషి చేస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సత్ఫలితాలు అందుకుంటున్న తీరు శుభపరిణామంగా మారింది.

పంచాయతీ రాజ్ శాఖ నేతృత్వంలో రెండు దశల్లో పనులు నిర్వహించాలని నిర్ణయించారు. మొదటి విడతలో రూ6 కోట్లతో పనులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. పనుల వేగవంతమైన అమలుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

**మనోల్లాసానికి చిరునామా.. :** శ్రీకాకుళం నగరంలోని కార్గిల్ విక్టరీ పార్కును ఇటీవల సుడా నిధులతో అభివృద్ధి చేసిన విధంగానే టెక్కలి పరిసరాల్లో పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధికి మంత్రి అచ్చెన్న ప్రాధాన్యం ఇస్తున్నారు. పట్టణంలో చిన్నారులకు మనోల్లాసం కలిగించే విధంగా ఆధునిక హంగులు కల్పిస్తూ, నయా బ్రాండ్‌ను సృష్టిస్తూ పార్కు సుందరీకరణకు నిధులు మంజూరు చేయించారు.

**కోనేటి మధ్యలో విశ్వ విఖ్యాత ఎన్టీఆర్ విగ్రహం :** పట్టణ సుందరీకరణకు, కోనేటి ప్రాంగణం అభివృద్ధికి గతంలో పాలకులు శ్రద్ధ తీసుకున్న దాఖలాలు లేవు. కానీ ఇప్పుడు కోనేరు పనులు చేపట్టడంతో పాటు తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన నందమూరి తారక రామారావు విగ్రహం ఏర్పాటుకు సైతం మంత్రి అచ్చెన్న చొరవ చూపుతుండటం విశేషం. అలానే చిన్నారుల కోసం రెండు పార్కులు ఏర్పాటు కానున్నాయి. యువతను ఆకట్టుకునే విధంగా క్రికెట్ నెట్ ఏర్పాటు చేయనున్నారు. పికెల్ బాల్ కోర్టు కూడా నెలకొల్పనున్నారు. పెద్దలు సేదతీరేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. కోనేటి చుట్టూ పచ్చందనాలతో కూడిన ప్రాంగణం రూపుదిద్దుకోనుంది. యువతకు మనోల్లాసం కలిగించే విధంగా పార్కు సుందరీకరణ చేపట్టనున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో ఇక్కడి వారికి మరింత ఆహ్లాదకర వాతావరణం అందనుంది. పక్కనే వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండటంతో ఆధ్యాత్మిక--పర్యాటక కేంద్రంగా ఈ పట్టుమహాదేవి కోనేరును పునరుద్ధరించనున్నారు. ఆధునిక సోయగాలతో అలరించనున్న ఈ కోనేరు పనులు అతి కొద్ది కాలంలోనే పూర్తి కానున్నాయని అధికారులు చెబుతున్నారు.

# భూ రికార్డులకు 'డిజిటల్' భద్రత





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో భూ బకాసురులు.. రైతులు, భూ యజమానులు, పేదల భూములను అడ్డగోలుగా దోచుకున్నారు. ఇందుకోసం రెవెన్యూ వ్యవస్థను పూర్తి స్థాయిలో భ్రష్టు పట్టించారు. రీ సర్వే పేరుతో రైతులకు లేనిపోని సమస్యలు సృష్టించడంతో పాటు ఉన్న పొలం కంటే తక్కువ విస్తీర్ణం పట్టాదారుపుస్తకాల్లో చూపించింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. లెక్కలేనన్ని సమస్యలు రెవెన్యూ శాఖలో సృష్టించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టడానికి చాలా శ్రమించాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా భూములకు సంబంధించిన ఫిర్యాదులే 90 శాతం వస్తున్నాయంటే గత ప్రభుత్వం ఏ స్థాయిలో సమస్యలు సృష్టించిందో అవగాహన చేసుకోవచ్చు. రెవెన్యూ సమస్యల్లేని రాష్ట్రంగా ఏపీ ఉండాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలతో రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ మార్గదర్శకంలో ఈ రెండేళ్లలో ఎన్నో సంస్కరణలను రెవెన్యూ శాఖలో తీసుకొచ్చారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ లాంటి నల్ల చట్టాన్ని, ఇబ్బందికరంగా ఉన్న నాలా చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసి కీలక నిర్ణయం తీసుకుంది. అంతే కాదు భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిటేడ్ యాక్ట్‌ను తీసుకొచ్చారు. రైతులకు ఊరట కలిగించేందుకు ఆర్ఓఆర్ యాక్ట్‌ను సవరించారు. రీ సర్వేపై గ్రామసభలు, అన్ని రకాల భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహించి అక్కడికక్కడే రైతుల సమస్యలను పరిష్కరించారు. రీ సర్వే 2.0లో రైతలను భాగాస్వాములను చేసి సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో వివాదాలకు తావులేని భూ రికార్డులను రూపొందిస్తున్నారు. రెవెన్యూ వ్యవస్థలో బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగిస్తూ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖలను అనుసంధిస్తూ భూములకు డిజిటల్ భద్రతను ప్రభుత్వం కల్పిస్తోంది. రైతులే నేరుగా ఆన్లైన్లో తమ భూములకు సంబంధించి 1బి, అడంగల్‌కు సొంతంగా డిజిటల్ లాక్ చేసుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో రైతుల అనుమతి లేకుండా ఏ అధికారి కూడా ఆ భూమిని మ్యుటేషన్ గానీ, రిజిస్ట్రేషన్ గానీ చేయడానికి వీల్లేదు. అలాగే 15 రకాల భద్రతా అంశాలతో రాజముద్రతో పకడ్బందీగా రూపొందించిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా రైతులకు ప్రభుత్వం అందిస్తోంది.

**22ఎ నిషేధిత భూములకు విముక్తి :** రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటూ, భూ యజమాన్య హక్కులు కలిగి ఉండి కూడా గత ప్రభుత్వ నిర్వాకంతో భూములు 22ఎ నిషేధిత జాబితాలో ఉండడంతో ఇబ్బందులకు గురౌతున్నారు. వైసీపీ ప్రభుత్వం రీ సర్వే పేరుతో భూములు కొట్టేయాలనే దుర్బుద్ధితో అనేక వందల ఎకరాలను 22ఎ జాబితాలో చేర్చింది. రైతుల ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం ఐదు రకాల భూములైనటువంటి... నిషేధిత జాబితాలో ఉన్న పట్టా భూములు, మాజీ సైనికాధికారులు భూములు, స్వాతంత్ర్య సమర యోధుల భూములు, రాజకీయ బాధితుల భూములు, 1954కు అసైన్ చేసిన భూములు, ఒకే సర్వే నెంబర్ కారణంగా 22ఎ జాబితాలోకి వెళ్లిన భూములకు విముక్తి కలిగించింది. అంతేకాదు 22ఏ జాబితా నుంచి తొలగింపు ప్రక్రియను కూడా చాలా సులభతరం చేసింది. 9 రకాల పత్రాల్లో ఏ ఒక్కపత్రం ఉన్నా ఈ భూములకు 22ఎ నుండి విముక్తి లభిస్తుంది. దీంతోపాటు ఏళ్ల పాటు నుండి సమస్యాత్మకంగా ఉన్న గ్రామ సర్వీసు ఈనామ్ భూములకు కూడా మోక్షం కల్పించారు. 1.3 లక్షల గ్రామ సర్వీసు ఇనామ్ భూములకు పూర్తి హక్కులు కల్పించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే 33 వేల ఎకరాల షరతులగల పట్టా భూములను కూడా 22ఎ జాబితా నుండి తొలగించారు. ఈ భూములను రైతులు నిరంభ్యతరంగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చు. అవసరాలకు విక్రయించుకోవచ్చు. అదేవిధంగా చుక్కల భూముల జాబితాలో ఉండి 22ఎలో ఉన్న మరో లక్షా 90 వేల ఎకరాల భూములకు మరికొన్ని రోజుల్లో విముక్తి కలిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వబోతోంది. ఇప్పటికే ఈ భూములపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. రైతులు, భూ యజమానుల హక్కుల పరిరక్షణ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రానున్న కాలంలో ఈ అడుగులు మరింత వేగంగా పడబోతున్నాయి.

**పేదలకు పెద్ద ఊరట... లక్షల ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు :** ఎన్టీఆర్ ప్రభుత్వ కాలం నుంచి పేద ప్రజలకు అసైన్డ్ చేసిన ఇళ్ల స్థలాలను నిషేధిత జాబితా నుండి తొలగించి వారికి పూర్తి హక్కులు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 10 ఏళ్ల కాలం ముగిసిన అసైన్డ్ ఇళ్ల స్థలాలన్నింటికీ రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కులు కల్పించాలని, అసైన్డ్ పట్టా, ఇంటి పన్ను రసీదు తప్ప మరేమీ కోరకుండా రిజిస్ట్రేషన్ చేయాలని రిజిస్ట్రార్లకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ స్థలాలు 22ఎలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములకు సంబంధించి ఇళ్ల పట్టాలు, ఇళ్లు రెగ్యులరైజేషన్ చేసుకున్న వారికి రెండేళ్లలోనే పూర్తి హక్కులు కల్పించింది. దీంతో పట్టణ పేదలకు పెద్ద ఎత్తున ఉపశమనం లభించింది. అలాగే పేదలకు ఇళ్ల పథకం కింద అసైన్డ్ స్థలాలు పొందిన పేదలందరికీ కూడా పట్టా పొందిన రెండేళ్లకే పూర్తి హక్కులు కల్పించాలని ఆలోచిస్తోంది. దీనిపై త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం వెలువడనుంది. ఇక పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న 10 వేల కుటుంబాల గృహాలను రెగ్యులరైజ్ చేసింది. మరో 25 వేల గృహాలను త్వరలో క్రమబద్ధీకరించనున్నారు. గ్రామకంఠాల్లో తరతరాలు ఇంటి స్థలాలు కలిగి ఉన్న, ఇళు నిర్మించుకున్న వారికి లింక్ డాక్యుమెంట్లు లేనప్పటికీ...వారికీ పూర్తి హక్కులను ప్రభుత్వం కల్పించింది. ఈ నిర్ణయాల ద్వారా లక్షల సంఖ్యలో లబ్దిదారులకు ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు లభించనున్నాయి. ఈ రెండేళ్లో కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి ప్రభుత్వంగా వ్యవహరించింది.

**ఏళ్ల తరబడి పెండింగ్ సమస్యలకు పరిష్కారం:** ఒకవైపు రెవెన్యూ వ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్కరణలు తీసుకొస్తూనే మరోవైపు ఒక గ్రామానికో, కొందరి రైతులకో పరిమితమై ఏళ్లగా పరిష్కారం కాని భూ సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక్ చొరవతో పరిష్కరించబడ్డాయి. తిరుపతి జిల్లాలోని శెట్టిపల్లి గ్రామంలో రెండు వేల కోట్ల రూపాయల విలువ చేసే 380 ఎకరాల భూమిని 2,111 మంది లబ్దిదారులకు అన్ని అడ్డంకులను తొలగించి అప్పగించారు. శ్రీసత్య సాయి జిల్లా నల్లమడ మండలం గోపెపల్లి గ్రామంలో 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 305 ఎకరాలకు పరిష్కారం చూపి రైతుల కళ్లల్లో ప్రభుత్వం ఆనందం నింపింది. ఏలూరు జిల్లాల్లో ఒక్క రోజులోనే 142 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి భూ యాజమానులకు ఊరటనిచ్చారు. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం గుంజేపల్లి గ్రామంలో 13.59 ఎకరాల్లో ఉన్న ఇళ్ల పట్టాల భూములు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండగా నిషేధిత జాబితా నుండి తొలగించి 226 కుటుంబాలకు ప్రభుత్వం పెద్ద ఉపశమనం కల్పించింది.

## గనుల రంగ అభివృద్ధికి పటిష్ట చర్యలు



(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మైన్స్ అండ్ జియాలజీ అధికారులతో మంత్రి సమీక్షించి మాట్లాడారు. మైనింగ్‌కు సంబంధించి గత ఐదేళ్లలో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈజ్ ఆఫ్ డూయింగ్‌తో పాటు, పర్మిషన్స్ (ఈసీ పర్మిషన్స్ వంటివి) త్వరితగతిన ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. మైనింగ్ రంగంలో ఎక్కువ శాతం మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉన్నందున అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఇసుకకు సంబంధించి గత ఐదేళ్లలో వ్యవస్థ అస్తవ్యస్తమైందన్నారు. భవన నిర్మాణ రంగం కుదేలయింద న్నారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం నష్టపోయినా పర్వాలేదు కానీ, ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచాలని ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రతి సంవత్సరం సగటున ప్రభుత్వానికి రావాల్సిన రూ. 300 కోట్ల ఆదాయం తగ్గిపోయినా, ప్రజలకు ఇసుక సరఫరాలో ఎక్కడా కూడా ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. ఎన్జీటీ పర్మిషన్స్ ఇవ్వడంలో, ఈసీ పర్మిషన్స్ ఇవ్వడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మైనింగ్ లో "వ్యాల్యూ ఎడిషన్ కి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలకు సంబంధించి ఇవాళ భారతదేశంలో వచ్చిన పెట్టుబడులలో 25 శాతం పెట్టుబడులు ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయన్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, మొన్ననే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిఫెన్స్ ప్రాజెక్ట్ కు సంబంధించి రాకెట్ మ్యానుఫ్యాక్చరింగ్స్ పుట్టపర్తిలో రక్షణ రంగానికి చెందిన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ, రిలయన్స్ తదితర పరిశ్రమలు వచ్చాయన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మైనింగ్ రంగ అభివృద్ధికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.


## రెన్యూవబుల్ ఎనర్జీలో పెట్టుబడుల ప్రవాహం



(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏటా 87.6 కోట్ల యూనిట్ల క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి జరగనుంది. మొత్తం 600 మెగావాట్ల సామర్థ్యంతో ఉన్న ఈ ప్రాజెక్టులు రాష్ట్ర పునరుత్పాదక శక్తి రంగంలో అత్యంత వ్యూహాత్మక పెట్టుబడులలో ఒకటిగా నిలిచాయి. 2,400 ఎకరాలకు పైగా విస్తరించిన ఈ ప్రాజెక్టులో 12 లక్షలకు పైగా అత్యాధునిక టాప్ కాన్ బైఫేషియల్ సోలార్ మాడ్యూల్స్ ను వినియోగించడం జరిగింది. ఈ సౌర ప్రాజెక్టుల ద్వారా ఏటా సుమారు 11 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను నివారించే అవకాశం ఉంది. నిర్మాణ దశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మంది కార్మికులు పనిచేశారు. ప్రజాప్రభుత్వ స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలతో భూవినియోగం, అనుమతులు, గ్రిడ్ కనెక్షన్ వంటి ప్రక్రియలు వేగంగా పూర్తయ్యాయి. దీంతో రెండు ప్రాజెక్టులను 11 నెలల్లోనే ఎస్ఏఈఎల్ నిర్మించింది. భవిష్యత్ లో రూ. 10 లక్షల కోట్ల గ్రీన్ ఎనర్జీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది.

## స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు



(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహానాడులో మొత్తంగా 20 తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్ బ్యూరోలో నిర్ణయించారు. వీటిల్లో 10 ఏపీ, 4 తెలంగాణ, 1 అండమాన్ కు సంబంధించి తీర్మానాలు ఉన్నాయి. వీటితో పాటు మరో 4 ఉమ్మడి తీర్మానాలతో పాటు... అంతిమంగా కీలక రాజకీయ తీర్మానం చేపట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. ఇక 2026 మహానాడును స్త్రీ శక్తి థీమ్ తో నిర్వహించాలని నిర్ణయించడంతో... దాన్ని ప్రతిఫలించేలా మహానాడు ఉండాలని.. అలాగే ప్రసంగాలు ఉండాలని సీఎం ఆదేశించారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు, మహిళా సాధికారతకు, వారికి హక్కులు కల్పించే విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారనే అంశాన్ని వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతీ పథకంలోనూ మహిళలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపడుతోన్న కార్యక్రమాలు, చేస్తున్న అభివృద్ధి, వస్తున్న పెట్టుబడులు వంటి వాటిపై కూలంకుషంగా చర్చించాలని సీఎం ఆదేశించారు. ఈ మహానాడులో జరిగిన చర్చతో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై మరోసారి చర్చ జరగాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇక మన దేశం-మన బాధ్యత పేరుతో పొదుపు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేకంగా చర్చ జరపాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలను, కుట్రలను బహిర్గతం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉండాలని పొలిట్ బ్యూరో అభిప్రాయపడింది. ఇక తెలుగుదేశం చరిత్ర, ఎన్టీఆర్ సిద్ధాంతాలపై నేటి తరానికి తెలిసేలా మహానాడులో ప్రజెంటేషన్స్ ఇవ్వనున్నారు. హైబ్రీడ్ పద్ధతుల్లో ఈసారి మహానాడు జరుగుతున్నా... మహానాడు స్ఫూర్తి మాత్రం కొనసాగాలని సీఎం సూచించారు. మహానాడు కార్యక్రమాన్ని పండుగలా చేపట్టాలని పొలిట్ బ్యూరో సమావేశంలో సీఎం చంద్రబాబు సూచించారు. రెండు రోజుల ముందు నుంచి ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగరేయాలన్నారు. పార్టీ అగ్రనాయకత్వం మొదలుకుని క్షేత్ర స్థాయి కార్యకర్త వరకు మహానాడులో భాగస్వాములను చేసేలా నిర్వహించాలని టీడీపీ అధినేత ఆదేశించారు. ఇక అన్ని క్లస్టర్లల్లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టి మహానాడును ప్రారంభించాలని పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించారు.

# విలువల్లేని నేర రాజకీయాలు జగన్ సొంతం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తన ఐదేళ్ల పాలనను 'ఆటవిక పాలన'(జంగిల్ రాజ్)కు ప్రతీకగా మార్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు ఎల్లకాలం గుర్తుంచుకుంటారని... ప్రజలు మర్చిపోతారేమోననే భయంతో నెలకోసారి బెంగుళూరు నుంచి వచ్చి తాడేపల్లి మహల్‌లో పత్రికా సమావేశాలు పెట్టనవసరంలేదని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చురకలు వేశారు. గురువారంనాడు పత్రికా సమావేశంలో జగన్‌రెడ్డి చేసిన పలు వ్యాఖ్యలపై మంత్రి ధ్వజమెత్తారు,

**నేర రాజకీయాలు-ఆత్మ రక్షణలో జగన్ రెడ్డి :** నేర చరిత్ర గల కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రికి విలువలతో కూడిన రాజకీయాలపై మాట్లాడే నైతిక హక్కు ఏమాత్రం లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తాత రాజారెడ్డి, తండ్రి రాజశేఖర్‌రెడ్డి, జగన్‌రెడ్డిల ఆలోచనలు, వ్యవహార సరళి రాష్ట్ర ప్రజలకు సవివరంగా తెలుసునని, ఆ నేపథ్యంలోనే జగన్‌రెడ్డి గురువారం నిర్వహించిన పత్రికా సమావేశంలో పూర్తి ఆత్మ రక్షణ ధోరణిలో ఎదుటివారిపై దాడి చేసే విఫలయత్నం చేశారని మంత్రి వివరించారు. తనకు అందని ఎత్తులో ఉన్న వారిపై ఉమ్మి వేయాలని చూస్తే... అది తనపైనే పడుతుందన్న వాస్తవాన్ని జగన్ తెలుసుకోవాలని మంత్రి ఎద్దేవా చేశారు.

**తండ్రి మరణంతో లబ్ధి ఎవరికి? :** తన తండ్రి రాజశేఖర్‌రెడ్డి శవం సాక్షిగా ముఖ్యమంత్రి పదవి కోసం జగన్‌రెడ్డి బేరసారాలు జరిపిన వాస్తవం రాష్ట్ర ప్రజలకు తెలుసునని, తండ్రి మరణం పట్ల అనుమానాలుంటే ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎందుకు నివృత్తి చేసుకోలేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ జగన్ ను నిలదీశారు. తన తాత హత్యకు కారకులైన వారిని ఉపేక్షించి వదిలేయడం తన మంచితనానికి నిదర్శనంగా జగన్‌రెడ్డి చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. అదే జగన్‌రెడ్డి బాబాయి వివేకానందరెడ్డి హత్యకు కారకులైన కుట్రదారులు, హంతకులను కాపాడడానికి విశ్వ ప్రయత్నాలు చేశారని, ఇది కూడా ఆయన మంచితనానికి నిదర్శనమా అని జగన్ స్పష్టం చేయాలని మంత్రి నిలదీశారు. దీంతో జగన్‌రెడ్డి వ్యాఖ్యలకు, చేతలకు పొంతన లేదనేది స్పష్టమవుతోందని మంత్రి అన్నారు.

**అమరావతి నిర్మాణంతో బీపీ పెంచుకుంటున్న జగన్ :** తన ఐదేళ్ల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం తర్వాత శరవేగంగా సాగుతున్న రాజధాని నిర్మాణంతో జగన్ రెడ్డికి రోజురోజుకీ రక్తపోటు(బీపీ) పెరుగుతోందని, దాని కారణంగానే అసత్య ప్రచారానికి దిగజారుతున్నారని మంత్రి విమర్శించారు. తన కుటుంబం కోసం ప్రజాధనంతో విశాఖపట్నంలో కట్టుకున్న జగన్ మహల్ నిర్మాణం ఖర్చు గురించి మాట్లాడకుండా ఆరోపణలు చేయడం అనుచితం కాదా అని మంత్రి ప్రశ్నించారు.

ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు రాజధాని విషయంలో మూడు ముక్కలాటాడి ప్రతి పక్షంలో ఉండి నేడు తాను చేసిన 'మావిగన్' ప్రతిపాదనకు ప్రజల మద్దతు పోటెత్తుతోందని చెప్పుకోవడం జగన్‌కే చెల్లుతుందని, ప్రజలు మావిగన్‌ను నిర్ద్వందంగా తిరస్కరించారని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

**కల్తీ మద్యం తయారీదారుల పట్ల మానవత్వమా? :** కల్తీ మద్యం తయారీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి జోగి రమేష్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తోందంటూ మానవతావాదానికి జగన్ కొత్త నిర్వచనం చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. రమేష్‌ను జైలులో ఉంచడం మానవత్వానికి విరుద్ధమైతే...గత ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును 53 రోజులు జైలులో నిర్బంధించడం ఏ కోవలోకి వస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ జగన్ ను నిలదీశారు.

**సంతానమే సంపద-దూర దృష్టికి తార్కాణం :** సంతానోత్పత్తి నియంత్రణ కారణంగా చైనాతో పాటు పలు దేశాలు ఎదుర్కొంటున్న మానవ వనరుల సమస్యల నేపథ్యంలో...రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటును ప్రస్తుత 1.50 నుంచి 2.10కు పెంచే దిశగా దీర్ఘకాలిక ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తే...తేలికచేసి మాట్లాడడం జగన్ హ్రస్వ దృష్టికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టికి తార్కాణాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. అధిక సంతానం బాగోకులకు అవసరమైన వాతావరణాన్ని కల్పించేందుకు వివరణాత్మక ప్రణాళికలను కూడా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని, ఈ విషయంలో ప్రజలకు సరైన అవగాహన కల్పించేందుకు త్వరలో తగు కార్యక్రమాలను ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. జనాభా స్థిరీకరణతోనే ఆశించిన మేరకు పాపులేషన్ డివిడెండ్ లభిస్తుందన్న వాస్తవం ఆధారంగా ఈ నూతన విధానానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని మంత్రి స్పష్టం చేశారు

**వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేసిన జగన్‌రెడ్డి :** నూతన వైద్య కళాశాలల నిర్మాణం, నాడు-నేడు పనులకు సంబంధించి నిర్దేశించిన వ్యయం లక్ష్యాలలో 15 శాతం మాత్రమే ఖర్చు చేసి, మాజీ సిఎం జగన్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం కుటిలత్వమని మంత్రి అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ. 2,500 కోట్లు బకాయిలు పెట్టిన జగన్‌రెడ్డి ఈ అంశంపై మాట్లాడే హక్కు లేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

# రాష్ట్రంలో మోసపూరిత పాలన



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రభుత్వం మోసపూరిత పాలన కొనసాగిస్తోందని వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వై.ఎస్ జగన్మహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తూ 'జంగిల్ రాజ్' నడుపుతున్నారని విమర్శలు చేశారు. 'బాబు ష్యూరిటీ -- మోసం గ్యారంటీ' అన్నది ప్రతిరోజూ రుజువవుతోం దన్నారు. రెండేళ్ల పాలనలో ప్రజలకు చెప్పుకునే మంచి పని ఒక్కటీ చేయలేదని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే వైసిపిపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అమరావతి నిర్మాణం పేరుతో భారీ స్కాములు జరుగుతున్నాయని, అమరావతి కోసం ఇప్పటికే రూ. 47,387 కోట్ల అప్పులు తెచ్చారని, రాష్ట్ర ఖజానా నుంచి మరో రూ. 9,200 కోట్లు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ప్రత్యామ్నాయంగా 'మావిగన్' ప్రాంతాన్ని రాజధాని కారిడార్‌గా ప్రతిపాదించామని జగన్ తెలిపారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే మచిలీపట్నం పోర్టు, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారులు, మెడికల్ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయని చెప్పారు. 35 నుంచి 40 లక్షల జనాభా ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం రాష్ట్రానికి ప్రయోజనకరమని చెప్పారు. కల్తీ మద్యం కేసులో అసలు నిందితులను వదిలి మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఇరికించారని ఆరోపించారు. బిసి వర్గానికి చెందిన నేతను లక్ష్యంగా చేసుకుని రాజకీయ కక్ష సాధింపు చేస్తున్నారని అన్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని మామిళ్లపల్లి ఘటనను ప్రస్తావిస్తూ రైతులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' సహా 143 హామీల అమలు ఎక్కడ జరిగిందని జగన్ ప్రశ్నించారు. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు పన్నులు పెంచారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ. 4 చొప్పున అదనపు భారం మోపారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో 16 కేటగిరీల బస్సుల్లో కేవలం 5 కేటగిరీల్లో మాత్రమే ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, 52 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆరోపించారు. ఉద్యోగులకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, జిపిఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సహా దాదాపు రూ. 35 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. పెన్షన్ల సంఖ్యను లక్షల్లో తగ్గించారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 'బాబు అంటే మోసం -- జగన్ అంటే నమ్మకం' అని వ్యాఖ్యానించిన జగన్.. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం తమ రాజకీయ సంస్కృతి అని తెలిపారు. రాష్ట్రంలో ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్?. ఎవరివి హత్యా రాజకీయాలని ప్రశ్నించారు. రాజారెడ్డి, వివేకానందరెడ్డిల హత్యలు చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడే జరిగాయన్నారు. వైఎస్ఆర్‌ను అసెంబ్లీకి ఎలా వస్తావో చూస్తానని బాబు అన్నారని, తర్వాత నాలుగు రోజులకే ప్రమాదంలో చనిపోయారని చెప్పారు. బాలకృష్ణ గన్‌తో ఇద్దరిని కాల్చిపడేయలేదా అని ప్రశ్నించారు. వంగవీటి మోహనరంగాఎలా చనిపోయారని ప్రశ్నించారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని 'విజయవాడలో నిరాహారదీక్ష చేస్తుంటే, అర్ధరాత్రి నరికి చంపేశారు. ఈ ఘటనలో వేళ్లన్నీ చంద్రబాబు వైపే చూపిస్తాయి. ఈ కేసులో నిందితుడైన వెలగపూడి రామకృష్ణబాబును టిడిపి ఎమ్మెల్యేని చేశారు' అని అన్నారు. చంద్రబాబు నేర చరితను తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు అనేకసార్లు చెప్పారన్నారు. మహిళలను ఎక్కువమంది పిల్లల్ని కనమని సిఎం చెప్పడాన్ని తప్పుబట్టారు.

## విజయవాడలో ఎన్ఎస్ఈ పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్థిక అక్షరాస్యత, సురక్షిత పెట్టుబడులపై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో విజయవాడలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో భారీ స్థాయిలో పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 350 మందికి పైగా విద్యార్థులు, పెట్టుబడిదారులు, అధ్యాపకులు, ఆర్థిక నిపుణులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత, బాధ్యతాయుత పెట్టుబడులు, ఆర్థిక మరియు సైబర్ మోసాలపై అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాపిటల్ మార్కెట్లలో పెరుగుతున్న భాగస్వామ్య ప్రాముఖ్యతతో పాటు ముఖ్యంగా యువత, రిటైల్ పెట్టుబడిదారులు సమాచారంతో కూడిన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరాన్ని కార్యక్రమంలో వివరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ, విజయవాడ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆర్థిక అక్షరాస్యత నేటి కాలంలో ప్రతి ఒక్కరికీ అవసరమైన జీవన నైపుణ్యంగా మారిందన్నారు. పొదుపులు, పెట్టుబడులు, సెక్యూరిటీస్ మార్కెట్లు, ఆర్థిక మోసాల నివారణపై అవగాహన యువతలో ఆర్థిక నిర్ణయాల సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.

ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ, ఆర్థిక సాధికారతకు ఆర్థిక అక్షరాస్యత అత్యంత ప్రభావవంతమైన సాధనమన్నారు. పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాల ద్వారా ముఖ్యంగా యువతకు సురక్షిత పెట్టుబడులపై అవగాహన కల్పించి, భారత ఆర్థికాభివృద్ధిలో బాధ్యతాయుతంగా భాగస్వామ్యం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. సెక్యూరిటీస్ మార్కెట్లో అవకాశాలతో పాటు నష్టాలపై కూడా అవగాహన పెంపొందించడం ద్వారా ఆర్థికంగా స్థిరమైన భారతదేశ నిర్మాణానికి తోడ్పడగలమన్నారు.

సెబి సీజీఎం రాజేష్ కుమార్ దంగేటి మాట్లాడుతూ, జీవిత ప్రారంభ దశ నుంచే క్రమశిక్షణతో కూడిన పెట్టుబడులు అవసరమన్నారు. ద్రవ్యోల్బణం ప్రభావంతో కాలక్రమేణా డబ్బు విలువ తగ్గిపోతుందని, కేవలం పొదుపు చేయడం కాకుండా పెట్టుబడులు పెట్టడం కూడా అవసరమని సూచించారు. వ్యక్తుల వయస్సు, బాధ్యతలు, జీవిత దశలకు అనుగుణంగా పెట్టుబడి వ్యూహాలు మారాల్సిన అవసరం ఉందన్నారు.

ఇప్పటివరకు ఎన్ఎస్ఈలో దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ప్రత్యేక పెట్టుబడిదారులు నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లోనే 62.38 లక్షల మంది పెట్టుబడిదారులు ఉన్నారని నిర్వాహకులు వెల్లడించారు. వీరిలో 25 శాతం మహిళలు ఉన్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో పెట్టుబడి, ఆర్థిక ప్రణాళిక, సెక్యూరిటీస్ మార్కెట్ల అవగాహన, మ్యూచువల్ ఫండ్స్, సైబర్ మోసాల నివారణ, సురక్షిత డిజిటల్ పెట్టుబడులు, నకిలీ పెట్టుబడి హామీలను గుర్తించే విధానాలు, క్రమశిక్షణతో కూడిన పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలిక సంపద సృష్టి వంటి అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. అలాగే పెట్టుబడిదారులు రిజిస్టర్ కాని సంస్థలు, అవాస్తవిక లాభాల హామీలు, తప్పుదోవ పట్టించే సోషల్ మీడియా పెట్టుబడి సలహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరించారు. పెట్టుబడులు పెట్టే ముందు మధ్యవర్తుల నమోదును ధృవీకరించుకోవడం, రిజిస్టర్డ్ ప్లాట్‌ఫారమ్‌లను మాత్రమే వినియోగించడం, దీర్ఘకాలిక పెట్టుబడి విధానాలను అనుసరించడం ఎంతో ముఖ్యమని సూచించారు.

# గురుకుల విద్యార్థులకు 'క్రీడా' ప్రోత్సాహం



(మొదటి పేజీ తరువాయి)

గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి సవిత అభినందించారు. గత నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన టి. నాగజ్యోతి 76 కేజీల విభాగంగా జూనియర్ స్థాయిలో పోటీ పడింది. బాలిక 355 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలిచుకుంది. అదే జూనియర్ స్థాయి విభాగంలో పోటీపడిన కె. సత్యరామ్ రాజ్ 53 కేజీల విభాగంలో 110 కేజీలు ఎత్తి జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలుచుకున్నాడు. సబ్ జూనియర్ స్థాయి విభాగంగా పోటీపడిన వినోద్ కుమార్ 110 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం సాధించాడు. ఈ ముగ్గురు క్రీడాకారులతో పాటు వారికి కోచింగ్ అందజేసిన ఎండీ కమ్రుద్దీన్ ను మంత్రి సవిత అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులతో విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకులాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్ లతో పాటు షూస్ కూడా అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అంతకుముందు మంత్రి సవిత బంగారు పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు 'క్రీడా' ప్రోత్సాహం



**•ఏపీ బ్రాండ్‌ను నాశనం చేసింది జగన్‌నే: యామిని శర్మ**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ విమర్శించారు. అధికారం కోల్పోయిన నిరాశలో జగన్ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.

గత ఐదేళ్లపాటు మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీసిన జగన్‌కు అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆమె పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసింది జగన్‌మోహన్‌రెడ్డేనని ఆరోపించారు.

జగన్ పాలనలో రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలు, గంజాయి, మైనింగ్ మాఫియాలకు ప్రోత్సాహం లభించిందని, అదే అసలైన "జంగిల్ రాజ్" అని యామిని శర్మ వ్యాఖ్యానించారు. నేరస్థులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ఇప్పుడు శాంతిభద్రతలపై మాట్లాడటం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు.

దళితులపై దాడులు జరిగేలా చేసి, బీసీల సబ్‌ప్లాన్ నిధులను దుర్వినియోగం చేసి, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారని జగన్‌పై ఆమె విమర్శలు గుప్పించారు. ఇప్పుడు అదే వర్గాలపై ప్రేమ చూపుతున్నట్లు మాట్లాడటం ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

తాడేపల్లి ప్యాలెస్‌లో తయారైన అబద్ధాల స్క్రిప్టులను చదవడం మానేసి, ప్రజలు ఎందుకు తిరస్కరించారో జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలని యామిని శర్మ సూచించారు.

## క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యటన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా కలెక్టర్ సి. యం. సాయి కాంత్ వర్మ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయి బాట పట్టారు. వారంలో గురు, శుక్ర, శని వారాలు - మూడు రోజులు అధికారులు - మండల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు మండల ప్రత్యేక అధికారులు తమ మండలాల్లో పర్యటనలు చేశారు. మండల అధికారులతో సమీక్షలు నిర్వహించి ఏ విభాగంలో మండలం మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందో తెలుసుకోవడం జరిగింది. మండలంలో ఉన్న సమస్యలను సైతం గుర్తించి, ప్రణాళికాబద్ధంగా వాటిని పరిష్కరించుటకు చర్యలను చేపడుతున్నారు. మండలాల్లో వేసవి తీవ్రత, తాగునీటి సమస్య, జల ధార - జల హారతి కార్యక్రమం, జన గణన, పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల చేరికలు, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలు పరిష్కారం, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు, అంగన్వాడీ కేంద్రాల పనితీరు, ఆసుపత్రుల పనితీరు, పారిశుధ్య నిర్వహణ, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు తనిఖీ, క్షేత్ర స్థాయిలో ఎరువుల అవసరాలు తదితర అంశాలపై వివరంగా పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మూడు రోజుల పాటు జరిగే క్షేత్ర స్థాయి పర్యటన వలన ప్రతి గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాలు, వాటి అవసరాలను గుర్తించి చేపట్టుటకు అవకాశం ఉందని మండల ప్రత్యేక అధికారులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పట్ల ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సంతృప్తి మేరకు పరిష్కారం చేయుటకు మంచి అవకాశం అన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని వాటిపట్ల ప్రజల్లో ఉండే పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ నేరుగా తెలుసుకుని అవసరం మేరకు చర్యలు చేపట్టవచ్చని చెప్పారు.

## శ్రీనిధి టవర్స్‌లో ఉచిత వైద్య శిబిరం




**రామ్ మందిర్ ఏరియా, మే 21 (జర్నలిస్ట్ ఫైల్) :** కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లోని శ్రీనిధి టవర్స్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పైగా రోగులకు నిపుణులైన వైద్యులు సేవలు అందించారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి తక్షణ రోగ నిర్ధారణ చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. పండుగలు, సెలవులు అనే తేడా లేకుండా మెడికవర్ ఆసుపత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అవసరమైతే రోగులను కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించి ఆధునిక వైద్యం అందిస్తామని చెప్పారు. అపార్ట్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు దేవదర్శన్ రెడ్డి, కార్యదర్శి బిట్టు వెంకటేష్, సుదం కోటేశ్వర్ మాట్లాడుతూ కళ్యాణ్‌నగర్ ప్రజలు, అపార్ట్‌మెంట్ నివాసితులకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, అబ్దుల్ వకీల్, శ్రీకాంత్, రమేశ్, అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు, నివాసితులు, కళ్యాణ్‌నగర్ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలి: టీయూసీఐ




**రామ్ మందిర్ ఏరియా, మే 21 (జర్నలిస్ట్ ఫైల్) :** 60 ఏండ్లు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు కనీసం రూ.9 వేల పెన్షన్ అందించాలని టీయూసీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనిలోని ఓల్డ్ అశోక టాకీస్ లేబర్ అడ్డా వద్ద కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచి గోడపత్రికను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఈసంపల్లి రాజేందర్, రాష్ట్ర నాయకులు ఆడెపు శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు పూర్తిస్థాయి ప్రయోజనాలు అందడం లేదన్నారు. రాష్ట్రంలోని అనేక మంది కార్మికులకు బీఓసీ కార్డులు లేవని, కార్డులు ఉన్నవారు రెన్యువల్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెన్యువల్ అయినా క్లెయిమ్‌లు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. నిరక్షరాస్యులైన కార్మికులకు సంక్షేమ పథకాల లబ్ధి సులభంగా అందక తీవ్ర నష్టాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వర్షం, ఎండ, చలిని లెక్కచేయకుండా కష్టపడే నిర్మాణ కార్మికులకు 60 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా పెన్షన్ సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.9 వేల పెన్షన్‌తో పాటు డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్, సహజ మరణం వంటి సంక్షేమ పథకాల నగదు సహాయాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 25న నిర్వహించే "చలో హైదరాబాద్" కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా కార్మికులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు తోకల రమేష్, జిల్లా కోశాధికారి ఇనగాల రాజేశ్వర్, కలువల రాజమల్లు, యాదగిరి, రాజయ్య, నాని, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష



**రామ్ మందిర్ ఏరియా, మే 21 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ బుధవారం గోదావరిఖనిలోని క్యాంప్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశంనిర్వహించారు. ఈ సమావేశంలో సింగరేణి, మున్సిపల్, పంచాయతీ రాజ్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ సౌకర్యాలు తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలన తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి, మౌలిక వసతులు మరియు పరిపాలనలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరిస్తాం.. అభివృద్ధిలో ప్రతీకగా తీర్చిదిద్దుతాం.

-బీరంగూడ, అమీన్పూర్ డివిజన్ల లో సుడిగాలి పర్యటన..
-త్వరలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన..
-ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**జర్నలిస్ట్‌ఫైల్**అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని తులసివనం కాలనీ, భ్రమరాంబిక నగర్ కాలనీ, ఏ ఆర్ బృందావన్ కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీ, అంజనాద్రి కాలనీ, టైలర్ కాలనీ, ఎన్ ఎస్ ఎల్ కాలనీ, ఎన్ బి ఆర్ కాలనీ, ఇక్రిశాట్ కాలనీలలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్, అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ పర్యటించారు. నేరుగా ప్రజలు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమై క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసీ రోడ్లు, యూజీడీలు, విద్యుత్, తాగు నీరు తదితర అంశాలపై చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను నివేదిక రూపంలో తనకు అందించాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించి నిర్దేశించిన గడువుగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. అమీన్పూర్ పరిధిలో దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టడంతో పాటు.. ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. నూతన కాలనీలకు సైతం అందించేందుకు ఇప్పటికే ప్రణాళికలు పూర్తయ్యాయని తెలిపారు. కాలనీలలో ప్రభుత్వ స్థలాలు పార్కులు కబ్జాలు గురికాకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య విషయంలో ప్రజలకు ఇబ్బందులకు తలెత్తకుండా నూతన సిబ్బందిని సైతం నియమిస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీలు ఏర్పడడంతో విద్యుత్ డిమాండ్ పెరిగిందని.. ఇందుకు అనుగుణంగా నూతన సబ్ స్టేషన్లతోపాటు పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు మాట్లాడటం తన నైజం అని.. మిగతా సమయం ప్రజల అభివృద్ధి సంక్షేమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని.. అవసరమైన నిధులు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అతి త్వరలో బీరంగూడలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ఎమ్మెల్యేనే స్వయంగాతమ కాలనీలకు రావడం పట్ల ఆయా కాలనీల ప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు బాలరాజు, కృష్ణ, యూనుస్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్ డిఈ వెంకటరమణ, జలమండలి డిజిఎం శివకుమార్, విద్యుత్ శాఖ ఏడి సంజీవ్, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు మోటరైజ్డ్ ట్రైసైకిళ్ల పంపిణీ





**రామ్ మందిర్ ఏరియా, మే 21 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ బుధవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మోటరైజ్డ్ ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 20 మంది దివ్యాంగ లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఉచిత వాహనాల పంపిణీ ద్వారా దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి, స్వావలంబన సాధించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. దివ్యాంగుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించే దిశగా నిరంతరం కృషి కొనసాగుతుందని అన్నారు. వాహనాలు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ విజయవంతం



**వాజేడు , మే 21 (జర్నలిస్ట్ ఫైల్) :** అల్ ఇండియా ఆర్గనైజేషన్ అఫ్ కెమిస్ట్ ఌ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ ఌ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆన్ లైన్ మందుల అమ్మకాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా మందుల షాపుల ఒక రోజు బంద్ ను వాజేడు మండల కెమిస్ట్ ఌ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ షాపుల బంద్ ను నిర్వహించారు. ఆన్లైన్ పార్మసి కి వ్యతిరేకంగా నిర్వహించిన దేశ వ్యాప్త బందులో భాగంగా మండల వ్యాప్తంగా మందుల షాపులు బంద్ నిర్వహించారు. నకిలీ మందుల విక్రయాలను అరికట్టాలని, ఆన్లైన్ అమ్మకాలను నిలిపివేయాలని మండల మెడికల్ షాపు యజమానులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మందుల షాపు యజమానులు మొగిలి, రత్న శంకర్, నరేందర్, నరసింహారావు, రాము, హరిబాబు, భాస్కర్, రాజేష్, అబ్దుల్లా, రాజు పాల్గొన్నారు

## మెడికల్ షాపుల బంద్ విజయవంతం

**తాండూర్, (జర్నలిస్ట్ ఫైల్) :** ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన మెడికల్ దుకాణాల బంద్‌లో భాగంగా బుధవారం తాండూర్ మండలంలో మెడికల్ షాపుల యజమానులు షాపులు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ చారి మాట్లాడుతూ, ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలు జరపడం, అధిక డిస్కౌంట్లు ఇవ్వడం వల్ల నాసిరకమైన మందులు మార్కెట్లో చలామణి అవుతున్నాయన్నారు. దీనివల్ల చిన్న మెడికల్ షాపులపై తీవ్ర ప్రభావం పడి ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడంతో దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ పాటిస్తున్నామని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## పాత మొబైల్స్ కొంటున్నవాన్ని పోలీసులకు పట్టించిన.. నిమ్మనపల్లి సర్పంచ్ వేల్పుల రమేష్..

**పెద్దపల్లి, మే 21 (జర్నలిస్ట్ ఫైల్) :** పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పాత మొబైల్ ఫోన్లకు ప్లాస్టిక్ వస్తువులు ఇస్తున్న వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చి వాళ్ళని సర్పంచ్ వేల్పుల రమేష్ పట్టించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాలలో వాడబడకు తిరుగుతూ పాత మొబైల్స్ తీసుకొని ప్లాస్టిక్ వస్తువులు ఇస్తున్నారని, అది పెద్ద స్కామ్ అని,పాత మొబైల్స్ ఎవరు ఇవ్వకూడదని,వాటితో నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, గ్రామాలలో నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అలాంటి వారిని నమ్మకూడదని గ్రామంలోకి రానీయకూడదని అన్నారు.

## ఇటిక్యాలలో హనుమాన్ దేవాలయ కమిటీ ఏకగ్రీవం



**రాయికల్ (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో నూతన హనుమాన్ దేవాలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బద్దం మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా తమ్మటి నరేష్, ప్రధాన కార్యదర్శిగా సామల్ల మహేష్, కోశాధికారిగా జవ్వాజీ నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా పాలెపు దశ కుమార్‌ను ఎన్నుకున్నారు. సలహాదారులుగా కొల్లూరి వేణు, కొడిమ్యాల లింగమూర్తి, దండ వేణి గంగారాజం, కంటే నాగభూషణ్, నేతుల సోమయ్య, బొమ్మన ముత్తయ్య, గుండా ఆనంద్‌లను నియమించారు. అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, జిల్లా ఆత్మ చైర్మన్ గంగారెడ్డి, ఉపసర్పంచ్ సాయి రెడ్డి, గ్రామ నాయకులు, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ విజయవంతం



**పెద్దపల్లి, మే 21 (జర్నలిస్ట్ ఫైల్) :** అల్ ఇండియా ఆర్గనైజేషన్ అఫ్ కెమిస్ట్ ఌ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ ఌ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆన్ లైన్ మందుల అమ్మకాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా మందుల షాపుల ఒక రోజు బంద్ ను తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మెంబెర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మదూరి వినోద్ కుమార్ ఆధ్వర్యంలోపెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మెంబెర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మదూరి వినోద్ కుమార్ మాట్లాడుతూ..ఆన్లైన్ పార్మసి కి వ్యతిరేకంగా నిర్వహించిన దేశ వ్యాప్త బందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా మందుల షాపులు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు,నకిలీ మందుల విక్రయాలను అరికట్టాలని, ఆన్లైన్ అమ్మకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కెమిస్ట్ అండ్ డ్రాగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పాత మొబైల్స్ కొంటున్నవాన్ని పోలీసులకు పట్టించిన.. నిమ్మనపల్లి సర్పంచ్ వేల్పుల రమేష్..



**పెద్దపల్లి, మే 21 (జర్నలిస్ట్ ఫైల్) :** పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ పాత మొబైల్ ఫోన్లకు ప్లాస్టిక్ వస్తువులు ఇస్తున్న వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చి వాళ్ళని సర్పంచ్ వేల్పుల రమేష్ పట్టించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాలలో వాడబడకు తిరుగుతూ పాత మొబైల్స్ తీసుకొని ప్లాస్టిక్ వస్తువులు ఇస్తున్నారని, అది పెద్ద స్కామ్ అని,పాత మొబైల్స్ ఎవరు ఇవ్వకూడదని,వాటితో నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, గ్రామాలలో నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అలాంటి వారిని నమ్మకూడదని గ్రామంలోకి రానీయకూడదని అన్నారు.

# ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులను వేగవంతం చేయాలి

**ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలి : జిల్లా కలెక్టర్ అంకిత్.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 21 (జర్నలిస్ట్ ఫైల్) : ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచి ఎక్కువ పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ఎం జి ఎన్ ఆర్ ఇ జి ఎస్, మహిళా స్వయం సహాయక సంఘాలు, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం (ఎన్ఎఫ్‌బీఎస్), చేయూత పథకం తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ సీఈవో దివ్య అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు వేగవంతం కావడానికి సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త జాబ్ కార్డులు మంజూరు చేసి, ఉపాధి హామీ కూలీలు పూర్తి స్థాయిలో పని దినాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం, చేయూత పథకాల లబ్ధి అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూడీఐడీ (యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ) కార్డులను అందరికీ అందేలా ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీ కూలీలు ఉదయం 05 గంటలకు పనిస్థలాలకు చేరుకొని విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మహిళా సంఘ భవనాలు తదితర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. మండలాల్లో నమోదైన జాబ్ కార్డు కార్మికుల హాజరు శాతం పెంచి కనీసం 40 రోజుల పాటు పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జూన్ చివరి నాటికి మెటీరియల్ కాంపొనెంట్ క్రింద బుక్ చేయగల నిధులపై ఈఈలు పూర్తి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. జల్ సంచయి జన్ భగీరథి పురస్కారాలను జిల్లా సాధించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. చేయూత పెన్షన్ లబ్ధిదారుల లైవ్‌నెస్ అథెంటికేషన్‌ను పారదర్శకంగా నిర్వహించి నగదు పంపిణీపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. దివ్యాంగుల సదరం కేంద్రాల్లో సౌండ్ ప్రూఫ్ పరికరాలు, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలులో అర్హులైన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా చూడాలని సూచించారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై చీతా ఫోర్స్ టీం మెరుపు దాడి

**: పోలీస్ కమీషనర్ 2 చోట్ల దాడుల నిర్వహణ**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 21 (జర్నలిస్ట్ ఫైల్) : నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు,సీ.సీ.ఎస్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీతా ఫోర్స్ సిబ్బంది అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి వరుస తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాళేశ్వర్ గ్రామ వాగు ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో చీతా ఫోర్స్ టీం మెరుపు దాడి నిర్వహించింది.అక్కడ జేసీబీ సహాయంతో వాగు నుండి ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు.దాడిలో ఒక జేసీబీ యంత్రంతో పాటు ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నవీపేట్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కి అప్పగించారు.అలాగే నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తల్వేద గ్రామ వాగులో అక్రమంగా ఇసుకని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.5 ట్రాక్టర్ లను స్వాధీన పరుచుకొని తదుపరి చర్యల నిమిత్తం నందిపేట్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కి అప్పగించనైనది.అక్రమ ఇసుక రవాణా,ప్రకృతి వనరుల దోపిడీపై కఠిన చర్యలు కొనసాగుతాయని,ప్రజలు ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## కందుకూర్ మండల కేంద్రంలో 132 కె.వి ఉపకేంద్రాన్ని ప్రారంభించిన టీజీఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జిల్లా చీఫ్ ఇంజనీర్ పాండ్యా



(జర్నలిస్ట్ ఫైల్) మహేశ్వరం మే 21 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో..సార్ ఈ రోజు అనగా బుధవారం కందుకూరు లో టీజీ ట్రాన్సకో నిర్మించిన 132కేవీ ఉపకేంద్రాన్ని టీజీస్పడీసీల్ రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజినీర్ పాండ్య ప్రారంభించినారు. ఈ ఉపకేంద్రం ఏర్పాటు వల్ల 33 కె.వి జైత్వరం, పులిమామిడి, నేదునూర్, కందుకూరు ఉపకేంద్రాలకు సరఫరా అవుతుందని తెలిపారు. ఇట్టి కార్యక్రమము లో రాజేంద్రనగర్ ఎస్ఈ శ్రీరామ్ మోహన్, ట్రాన్స్కో ఎస్ ఈ లక్ష్మణ్ రావు, కందుకూరు డిఈ గోపాలకృష్ణ, మామిడిపల్లి ఏడిఈ శంకర్, కందుకూరు ఏఈ వేణుగోపాల్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.. జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్ ఆదేశాలు..



శేరిలింగంపల్లి మే 21 (జర్నలిస్ట్ ఫైల్) : పటాన్‌చెరు సర్కిల్‌లోని ముత్తంగి వార్డును జోనల్ కమిషనర్ ఈరోజు సందర్శించారు. సందర్శనలో భాగంగా కంధనూర్, ఘన్పూర్, వెల్మల గ్రామాల్లో పారిశుధ్య పనులను, బోర్‌వెల్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పారిశుధ్య కార్యకలాపాలను సమీక్షించిన జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్, గ్రామాల్లో చెత్త సేకరణ, మురుగు కాలువల శుభ్రత, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బోర్‌వెల్‌లు పనిచేయకపోవడం, నీటి ఎద్దడి వంటి సమస్యలపై స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. బోర్‌వెల్ మరమ్మతులు, కొత్త బోర్‌వెల్‌ల ఏర్పాటు, మురుగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పౌర సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. జోనల్ కమిషనర్ వెంట సర్కిల్ స్థాయి ఉప కమిషనర్ మరియు సర్కిల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిజామాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్



బక్రీద్ పండుగ నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి,ప్రజలలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలి పాత నేరస్థులపై నిఘా పటిష్టము చేయాలి చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై నిర్విరామముగా దాడులు నిర్వహణ,అవసరం అయితే పి.డి యాక్ట్ నమోదు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 21 (జర్నలిస్ట్ ఫైల్) : బుధవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాదు డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి పై నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సమగ్ర సమీక్ష సమావేశం చేపట్టారు.ఈ సమావేశంలో నిజామాబాదు డివిజన్ ఏ.సీ.పీ,సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు,ఎస్ హెచ్ ఓ లు,ఎస్సైలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సమావేశం ప్రారంభంలో రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు బక్రీద్ పండుగ నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని,చెక్ పోస్ట్ ల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని,వాహనాల తనిఖీలు,చెక్ పోస్ట్ ల వద్ద సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు.నిజామాబాదు డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ముఖ్యంగా హత్య,హత్యాయత్నం,చోరీలు,మహిళలపై నేరాలు,సైబర్ మోసాలు,డ్రగ్స్,గంజాయి అక్రమ రవాణా,పేకాట,గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు.పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని,రౌడీషీటర్లు,పాత నేరస్తులు,బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి,అనుమానాస్పద వ్యక్తులు,వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు.మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,షీ టీమ్స్,ఈగల్ టీమ్స్,చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు.విద్యాసంస్థలు,బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు,జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు,రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.డ్రగ్స్,గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని,అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.అలాగే పేకాట,గుట్కా,ఇసుక,ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిశుభ్రత,సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి,నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు.చివరిగా శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి,సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం,రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు.రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే,స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,త్రిబుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్)ఎన్.శుభం ప్రకాష్,నిజామాబాద్ ఏ.సి.పి బి.ప్రకాష్ యాదవ్, సి.టి.సి. ఏ.సి.పి రాజశేఖర్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జి.మల్లేష్, సిసిఆర్బి సి.ఐ ఆర్.అంజయ్య, సి.ఐలు, ఎస్హెచ్ఓలు, ఎస్సైలు, ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఎన్ ఆర్ ఐల సంక్షేమం.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సయోధ్యకు ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి కృషి




కీలకంగా మారనున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఏపీ పర్యటన

మొదటి రోజు ఏపీ ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కమిటీ భేటీ . రెండు తెలుగు రాష్ట్రాల నుండి సుమారు 50 లక్షల వలసదారులు. రెండు రాష్ట్రాల పరస్పర సహకారంతో ఎన్నారై ల సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి. తెలంగాణ ప్రభుత్వ అడ్వైజరీ కమిటీని సాదరంగా ఆహ్వానించిన ఏపీ ప్రభుత్వం. ప్రతి దేశంలో ప్రతినిధులను పెట్టే విధానం,ప్రత్యేక ఏపీ ఎన్ ఆర్ టి సొసైటీ ఏర్పాటు,జిల్లాకో ఎన్ఆర్ఐ సెల్ ఆలోచన ఆమోదయోగ్యమైనవి

తెలంగాణ ఎన్నారై విధాన రూపకల్పనలో ఏపీ పర్యటన కీలకం . రెండు రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ముందుకు సాగేలా ఇరుపక్షాల చొరవ. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే స్పష్టీకరణ.తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై కమిటీ తొలి పర్యటన ఏపీలోనే కావడం పట్ల హర్షం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 21 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలో కొత్త ఎన్నారై విధివిధానాల రూపకల్పనలో ఆంధ్రప్రదేశ్ పర్యటన కీలకంగా మారనుందని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఆంధ్రప్రదేశ రాష్ట్రంలో పర్యటించారు.ఈ నెల 20,21 తేదీల్లో రెండు రోజుల పాటు సాగనున్న పర్యటనలో భాగంగా మొదటి రోజు అడ్వైజరీ కమిటీ చైర్మన్ డా.బిఎం వినోద్ కుమార్,నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి నాయకత్వంలో ఏపీ ప్రభుత్వం ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో భేటీ అయ్యారు.ఈ మేరకు గుంటూరు జిల్లా తాడేపల్లి లో గల ఏపీ ఎన్ ఆర్ టి సొసైటీ కార్యాలయంలో ఎన్నారై మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ఎన్ఆర్టి అధ్యక్షులు,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేమూరు విజయ్ కుమార్,సిఈఓ కృష్ణ మోహన్ లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పలు కీలక అంశాల పై చర్చించారు.ఏపీ ప్రభుత్వం ఎన్నారై సంక్షేమానికి ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న విధివిధానాలను మంత్రి,సదరు సిఈఓ కూలంకషంగా వివరించారు.ఎన్నారై ల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించే విధివిధానాల రూపకల్పనలో ఏపీ ప్రభుత్వం,తమ మంత్రిత్వ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.అనంతరం కమిటీ సభ్యులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.త్వరలోనే ఏపీ ఎన్నార్టీ టవర్ నిర్మాణం నిర్మాణ దశలో ఉందని త్వరలోనే పూర్తి చూసుకుంటుందన్నారు.దాని ద్వారా దాదాపు 5 నుండి 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.రెండు తెలుగు రాష్ట్రాల నుండి సుమారుగా 50 లక్షల మంది వలసదారులున్నారని దీని ద్వారా ప్రభుత్వానికి 30 వేల పైచిలుకు రెమిటెన్స్ రావడంతో పాటు విదేశాల్లో మన రాష్ట్రాల యొక్క ప్రాధాన్యతను పెంపొందించడంలో ఆస్కారం ఉంటుందన్నారు.వాళ్ళంతా మనవాళ్లే కాబట్టి వారి సంక్షేమం చూసుకోవాల్సిన బాధ్యత కూడా మనదే అని చెప్పారు.అటు మంత్రి తన వ్యక్తిగత జీవితంలో చదువు,ఉద్యోగం రీత్యా విదేశాల్లో గడిపిన కాలంలోని అనుభవాలను పంచుకున్నారు.ఈ మేరకు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని,అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై కొత్త పాలసీని రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వివిధ రాష్ట్రాల పర్యటనలకు శ్రీకారం చుట్టిందన్నారు.అందులో తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం ఆనందంగా ఉందన్నారు.రాబోవు రోజుల్లో తెలంగాణలో ఎన్నారై సంక్షేమానికి విధివిధానాల రూపకల్పనకు ఈ పర్యటన ఎంతో దోహదపడుతుందన్నారు.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఎన్నారై ల కొరకు అమలు చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు.ఎన్నారై ల కొరకు ఇతర దేశాల్లో ప్రత్యేకంగా ప్రతినిధులను నియమించడం,ఎన్నారైలను ఏకతాటిపై తీసుకురావడానికి ఏపీ ఎన్నార్టీ సొసైటీ ఏర్పాటు చేయడం,ప్రతి జిల్లా కలెక్టరేట్ లో ఎన్ఆర్ఐ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి రెవెన్యూ పోలీసు సిబ్బందిని కేటాయించడం,24 గంటల పాటు సహాయ కేంద్రం,పంజాబ్ రాష్ట్ర స్ఫూర్తితో ఏపీ పోలీస్ ఎన్నారై సెల్ ఏర్పాటు,ప్రత్యేక మంత్రిత్వ శాఖ,పరిమితులు లేకుండా ప్రవాసాంధ్ర బీమా తదితర ప్రధాన అంశాలు ఆవాదయోగ్యంగా నం, అభినందించదగినవి అని కొనియాడారు.అనంతరం తెలంగాణలో గల్ఫ్ కార్మికులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు.అనారోగ్య సమస్యలు మరి ముఖ్యంగా తెలియని నేరాలకు జైలు శిక్ష అనుభవించడం, బాధితుల కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇతరత్రా సమస్యలను గురించి వివరించారు.అనుకొని సంఘటనల్లో మృతి చెందితే పార్థివదేహాన్ని తరలించడంలో ఎదుర్కొంటున్న సమస్యను గుర్తుచేశారు.వీటన్నింటిని అధిగమించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అడుగులు వేస్తుందన్నారు.రెండు తెలుగు రాష్ట్రాల ఎన్నారైలకు తలెత్తే సమస్యలను ఇరుపక్షాల సహకారంతో సమిష్టిగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.విదేశాలకు వెళ్లే ముందు పకడ్బందీగా ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను చేపట్టాల్సిన అవసరముందని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్ ఆర్ టి చైర్మన్,ప్రభుత్వ సలహాదారులు వేమూరు రవికుమార్,సీఈఓ డా.కృష్ణ మోహన్,తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి,మెంబర్లు సింగిరెడ్డి నరేష్ రెడ్డి,నంగి దేవేందర్ రెడ్డి,చెన్నమనేని శ్రీనివాస రావు లతో పాటు మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి,రాష్ట్ర గీత కార్మిక సహకారం కార్పొరేషన్ చైర్మన్ చంద్ర శేఖర్ గౌడ్,ప్రొఫెసర్లు జునుగురు శ్రీనివాస్,విజయ్ కొర్రా,ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నో సంవత్సరాల నిరీక్షణ ఫలించిన వేళ

**-అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**-ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్ గబ్రుచౌహాన్**



షాద్నగర్ నియోజకవర్గం మే 21 (జర్నలిస్ట్ ఫైల్) : రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం నందిగామ మండలశీ పరిధిలోని చాకలిగుట్ట తండా పరిధిలోని అయ్యప్ప టెంపుల్ (రెడ్డి) కాలనిలో బుధవారం సర్పంచ్ గబ్రు చౌహాన్ నేతృత్వంలో సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో అండర్ డ్రైనేజీ పైపులైన్ పనులును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. సర్పంచ్ గబ్రు చాహన్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రెడ్డి కాలనీ వాసులు నిరీక్షణ చేశారని ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని, ఎన్నో ఏళ్లుగా రెడ్డి కాలనీ వాసుల కల నెరవేరినందుకు ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజల ప్రయోజనాలు కల్పించాలని ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సంతోషం వ్యక్తం చేస్తూ మాది చేతల ప్రభుత్వం, బిఆర్ఎస్ పార్టీ లాగా మాటల ప్రభుత్వం కాదని,చాకలిగుట్ట తండా పరిధిలోని ఎలాంటి అభివృద్ధి పనులకైనా కాంగ్రెస్ ప్రభుత్వం ముందు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మండలఅధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉపసర్పంచ్లు రవీందర్ నాయక్, వెంకటేష్ గౌడ్, ఆవులమంద శివశంకర్, డైరెక్టర్ రూప్ సింగ్, ఎస్టీ సెల్ నేత శ్రీను నాయక్, రాజు నాయక్, జంగా నరసింహులు, పసుల బుచ్చయ్య, ఆకుల జ్ఞానేశ్వర్, కావలి కృష్ణ, వార్డు మెంబర్లు ఉపసర్పంచ్ రవీందర్ నాయక్, రాజేష్, బుజ్జి శంకర్, శీను నాయక్, శ్రీనివాస్, నాగేష్, శ్రీను, నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం

**ఈనెల 25న చలో హైదరాబాదును జయప్రదం చేయండి.**



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 21 (జర్నలిస్ట్ ఫైల్) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం (టి యు సి ఐ) ఆధ్వర్యంలో నగరంలోని నెహ్రూ పార్క్ కార్మికుల అడ్డా వద్ద పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ....భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉన్నా కార్మికులకు సంక్షేమ పథకాలు సమగ్రంగా అందడం లేదన్నారు.ఇన్సూరెన్స్ రెన్యువల్ ని ప్రైవేటు కంపెనీలకు ఇవ్వకూడదన్నారు.నిర్మాణ రంగ కార్మికులు సహజ మరణానికి 5 లక్షలు ఇవ్వాలని,60 సంవత్సరాలు దాటిన కార్మికులకు 9000 రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు.పెళ్లి సమయంలో,పిల్లలు పుట్టినప్పుడు ఇచ్చే 30 వేల ఆర్థిక సహాయాన్ని లక్ష రూపాయలకు పెంచాలన్నారు.ఎండాకాలం కార్మికులు అడ్డాల వద్ద నిలుచోవడానికి షెల్టర్లు,తాగునీరు,మూత్రశాలల సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు.అర్హులైన వాళ్లందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలన్నారు.ఈ డిమాండ్ల సాధన కోసం యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్ లో లేబర్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకులు బి.లింగం, భవనానిర్మాణ కార్మికులు సంతోష్,కరణ్, మహేష్,రవి, సాయన్న, గంగాధర్, సల్మాన్, ఫయాజ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మహేష్‌కు అభినందనలు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిలో నూతనంగా నియోజకవర్గ టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ తాడిబోయిన మహేష్ యాదవ్ ను గురువారం ఆయన క్లినిక్ లో మంగళగిరి, కురగల్లుకు చెందిన పలువురు దేశం నాయకులు కలిసి అభినందించారు. డాక్టర్ యాదవ్ ను నాయకులు తోట రమేష్, శ్రీనివాసరావు, పాలకాయల వెంకటేశ్వరరావు శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మంత్రి లోకేష్ యువగళం పాదయాత్ర మంగళగిరికి చేరుకున్నప్పుడు యాత్ర విజయవంతం కావడానికి, సార్వత్రిక ఎన్నికలలో లోకేష్ విజయానికి డాక్టర్ యాదవ్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కృషికి గుర్తింపుగా నియోజకవర్గ డాక్టర్స్ సెల్ అధ్యక్షులుగా నియమించడం అభినందనీయమన్నారు. డాక్టర్ యాదవ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

## వైసీపీ హయాంలో ఎస్సీలపై దురాగతం



- ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్‌ను కిరాతక హత్య
- డాక్టర్ సుధాకర్‌పై తీవ్ర వేధింపులు
- కూటమి ప్రభుత్వంలోనే ఎస్సీలకు తగిన న్యాయం

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీ హయాంలో ఎస్సీలపై తీవ్ర దౌర్జన్యాలు జరిగాయని, ఇది ప్రజలందరికీ తెలిసిన సత్యమని తెలుగుదేశం పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు మండిపడ్డారు. గురువారం సాయంత్రం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్లలో ఎస్సీలను చిన్న చూపు చూశారని విమర్శించారు. చట్టాలను సమాధి చేస్తూ దురాగతాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ కారు డ్రైవర్ గా పని చేసిన దళిత యువకుడు సుబ్రమణ్యంను ప్రణాళిక ప్రకారం హత్య చేశారన్నారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ హత్య విషయాన్ని మసిపూసి మారేడు కాయ చేయాలని చూశారని తెలిపారు. కరోనా సమయంలో వైద్యానికి సంబంధించిన కిట్లు అడిగిన నేరానికి డాక్టర్ సుధాకర్ ను తీవ్రంగా వేధించారన్నారు. అనంతరం ఆయనపై కేసులు పెట్టి మానసికంగా కృంగిపోయేలా చేశారని తెలిపారు. ఈ కారణంగా ఆయన మరణించారని, ఇది ముమ్మాటికీ వైసీపీ హత్యలేనని స్పష్టం చేశారు. ఇవే కాకుండా ఎస్సీలకు రావాల్సిన పథకాలను అందకుండా వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ సామాజిక వర్గానికి పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీలకు అందాల్సిన పథకాలు గుమ్మానికి చేరుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పిడతల బాబురావు, గుడిమెట్ల దయారత్నం, చిలక వెంకటేశ్వర్లు, చిలక వెంకట్ స్వామి, యర్రంశెట్టి గిరి, చట్ల విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

## 34 అర్బన్ ల్యాండ్ సీలింగ్ కేసులకు పరిష్కారం



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** పట్టణ భూ పరిమితి (యు.ఎల్.సి) చట్టం కింద జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అధ్యక్షతన గల జిల్లా స్థాయి పరిశీలన కమిటీ 34 యు.ఎల్.సి కేసులను పరిష్కారం చేసింది. రెండు సంవత్సరాల వ్యవధి తర్వాత కమిటీ సమావేశం నిర్వహించడం, అందిన 36 దరఖాస్తులను కమిటీ పరిశీలన చేయడం జరిగింది. పరిశీలనకు వచ్చిన 36 కేసుల్లో 21 చెల్లింపు కేసులు కాగా, 15 ఉచిత కేసులు ఉన్నాయి. కమిటీ పరిశీలన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఉన్న మొత్తం 34 కేసులను ఆమోదించింది. పట్టణ భూ పరిమితుల చట్టం, 1970 ప్రకారం ప్రభుత్వ పరిధిలో వచ్చిన సీలింగ్ భూములు, మిగులు భూములు క్రమబద్ధీకరణ చేసుకొనుటకు గతంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు మేరకు భూములను క్రమబద్ధీకరణ చేయుటకు 36 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యు.ఎల్.సి దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా చేయడం జరిగిందని చెప్పారు. యు.ఎల్.సి కమిటీ సమావేశం రెండు సంవత్సరాల అనంతరం అనంతరం నిర్వహించి దీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కారం చేశామన్నారు. త్వరితగతిన ప్రజలకు సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆర్జీలను విచారణ చేశామని, భూ పరిపాలన ప్రధాన కమీషనరుకు పంపించడం జరుగుతుందని తెలిపారు.
అర్జీదారులు దాఖలు చేసిన ఆర్జీల వివరాలను వెబ్ సైట్ లో సైతం పొందు పరచడం జరిగిందన్నారు. ఆర్జీల విషయమై ఎవరికైనా ఏదేని అభ్యంతరములు ఉంటే జాయింట్ కలెక్టర్ మరియు అర్బన్ ల్యాండ్ సీలింగ్ అధీకృత అధికారికి ఈ నెల 29వ తేదీ లోగా లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఢిల్లీలో అరుదైన గౌరవం

- కేంద్ర మంత్రి పెమ్మసానిని కలిసిన టాపర్ విద్యార్థులు
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అందించే దిశగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రత్యేకంగా విమానంలో ఢిల్లీ విజ్ఞాన విహారయాత్రకు తీసుకెళ్లి అరుదైన అనుభూతిని కలిగించారు.
ఈ పర్యటనలో భాగంగా విద్యార్థులు గుంటూరు ఎంపీ, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి, పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ప్రోత్సహించారు. విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలు, ఉన్నత విద్యపై వారి ఆసక్తులను తెలుసుకుంటూ వారితో ఆత్మీయంగా ముచ్చటించారు.
దేశ రాజధాని ఢిల్లీ వైభవం, పార్లమెంట్, చారిత్రక కట్టడాలు, జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల గురించి విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ విద్యా విహారయాత్రను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ వారిని విమానంలో ఢిల్లీకి తీసుకెళ్లడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో అ-పార ప్రతిభ దాగి ఉందని, సరైన ప్రోత్సాహం లభిస్తే వారు దేశ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. విద్యార్థుల కలలను నిజం చేయడం కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలని, విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఆమె సూచించారు.
ఢిల్లీ పర్యటన ద్వారా దేశ రాజధాని పరిపాలనా వ్యవస్థ, జాతీయ చరిత్ర, దేశాభివృద్ధి గురించి ప్రత్యక్ష అవగాహన కలిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. జీవితంలో మరపురాని అనుభవాన్ని అందించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి ఇంటికి క్యూఆర్ కోడ్ డిజిటల్ డోర్ నెంబర్లు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో రానున్న రోజుల్లో ప్రతి ఇంటికీ క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ డోర్ నెంబర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి డిజిటల్ డోర్ నెంబర్ల వ్యవస్థపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నగర పాలక సంస్థలు, మునిసిపాలిటీల పరిధిలోని ప్రతి ఇంటికీ క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ డోర్ నెంబర్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందుకు సంబంధించిన చర్యలను ఇప్పటికే ప్రారంభించగా, అధికారులు, సచివాలయ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ఆధారంగా నగరంలోని అన్ని ఇళ్లను మ్యాపింగ్ చేసి, సంబంధిత వివరాలను అనుసంధానం చేయడం, ఈ-మున్సిపల్ ఈఆర్‌పీ ద్వారా డేటా సేకరణ, తనిఖీలు నిర్వహించడం వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. శిక్షణ పొందిన సిబ్బంది నగరంలోని ప్రతి ఇంటికి, వ్యాపార సముదాయానికి వెళ్లి క్షేత్రస్థాయిలో సమగ్ర వివరాలు సేకరించాల్సి ఉంటుందని చెప్పారు.
క్యూఆర్ కోడ్ డిజిటల్ డోర్ నెంబర్ వ్యవస్థ పూర్తిగా అమల్లోకి వస్తే గృహ యజమానులు, వ్యాపారస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కోడ్ స్కాన్ చేయగానే ఆ ఇంటికి సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
అనంతరం పట్టణ ప్రణాళిక విభాగం రోజువారీ పనితీరుపై సమీక్ష నిర్వహించిన కమిషనర్, డివిజన్లలో రోడ్లపై భవన నిర్మాణ సామాగ్రి లేకుండా చూడాలని, ఎవరైనా రోడ్లపై సామాగ్రి వేస్తే సీజ్ చేసి అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. నగరాన్ని పోస్టర్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని, జంక్షన్లలో డివైడర్లపై బ్యానర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అనధికార భవన నిర్మాణాలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు, టీపిబీఓలు, స్వర్ణ వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## బీజేపీపై తప్పుడు ప్రచారం ఆపాలి : ఎమ్మెల్సీ సోము వీర్రాజు

- ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలు అవాస్తవం
- ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పవన్ కళ్యాణ్ సమావేశానికి సంబంధించి ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని సోము వీర్రాజు పేర్కొన్నారు. ఈ మేరకు బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందించారు.
ప్రచారంలో ఉన్న వ్యాఖ్యల్లో ఎలాంటి అర్థం లేదని, రాజకీయంగా భారతీయ జనతా పార్టీ తీసుకునే నిర్ణయాలు, అమలు చేసే వ్యూహాలు పూర్తిగా సంస్థాగత విధానంలోనే ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్రఅభివృద్ధికి సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ పెద్దలతో అనేక సందర్భాల్లో చర్చించే స్వేచ్ఛ, వెసులుబాటు వారికి ఉందన్నారు.
ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సోము వీర్రాజు డిమాండ్ చేశారు. ఇలాంటి అర్థరహిత వ్యాఖ్యలను రాజకీయంగా ఉపయోగించుకోవాలని ప్రయత్నించే వారు ప్రజల్లో విఫలమవుతారని వ్యాఖ్యానించారు.

## డిప్యూటీ సీఎంపై ప్రొఫెసర్ నాగేశ్వరరావు వ్యాఖ్యలు ఖండనీయం : చిల్లపల్లి



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్) :** జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్ల పల్లి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. గురువారం మంగళగిరి జనసేన కార్యాలయంలో చిల్లపల్లి మాట్లాడుతూ ప్రజల్లో పవన్ కళ్యాణ్‌కు రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి కొందరు ఓర్వలేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాజకీయ విశ్లేషకులుగా వ్యవహరించే వారు వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సింది పోయి, ఒక రాజకీయ వర్గానికి అనుకూలంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు.
2014లోనే రాజకీయ లబ్ది పొందే అవకాశాలు ఉన్నప్పటికీ, అధికారాల కోసం కాకుండా ప్రజాసేవ లక్ష్యంగా పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, నిజాయితీ అనే విలువలతో ఆయన ముందుకు సాగుతున్నారని తెలిపారు.
పంచాయతీరాజ్ శాఖలో పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జాతీయ స్థాయిలో 13 పురస్కారాలు రావడం గర్వకారణమన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి సమస్యల పరిష్కారం, రాష్ట్రానికి పరిశ్రమలు, ప్రాజెక్టులు తీసుకురావడం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ఆయన కృషి చేస్తున్నారని చెప్పారు.
మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు సమయంలో జరిగిన పరిణామాలను ప్రజలు గమనించారని, అభివృద్ధి కోసం ఎవరు పనిచేస్తున్నారో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేసి ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు.
కులమతాలకు అతీతంగా అందరినీ కలుపుకొని రాష్ట్ర అభివృద్ధికి భాగస్వాములుగా చేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. ఆరోగ్యం బాగాలేకపోయినా శాఖ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు.
ప్రజలకు నిజాలను తెలియజేయాల్సిన బాధ్యత విశ్లేషకులపై ఉందని, కల్పిత కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని చిల్లపల్లి శ్రీనివాసరావు సూచించారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని జనసేన పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

## సూపర్ సిక్స్ పథకాల అమలుపై దుష్ప్రచారం తగదు : ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కనిపించడం లేదా అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. వినుకొండ నియోజకవర్గం లోని ఈపూరు మండలంలో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఈపూరులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తాజాగా వైఎస్ జగన్ విలేఖరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడుపై చేసిన వ్యాఖ్యలపై జీవీ ఆంజనేయులు ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు జరగడం లేదని జగన్ చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని జీవీ అన్నారు. "జగన్... నువ్వు ఏ ఊరికి రమ్మంటావో చెప్పు, దమ్ముంటే వినుకొండ నియోజకవర్గంలో నువ్వు కోరుకున్న గ్రామానికి రా, అక్కడ ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలు ఎలా అందుతున్నాయో కళ్లారా చూపిస్తా" అని జగన్‌కు జీవీ ఆంజనేయులు సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూపర్ సిక్స్' పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మరియు చదువుకునే ప్రతి బిడ్డకూ లబ్ధి చేకూర్చే 'తల్లికి వందనం' వంటి కార్యక్రమాలు ప్రజలకు విజయవంతంగా అందుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. పింఛన్లను రూ. 3వేల నుండి రూ. 4వేలకు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అన్నదాత సుఖీభవ నిధులు కూడా ఏటా ఇస్తున్నామన్నారు. ఇన్ని పథకాలు ప్రజలకు అందుతున్నా, అవి అందడం లేదంటూ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని జీవీ ఆంజనేయులు తిప్పికొట్టారు.
గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దాదాపు రూ. 9,70,000 కోట్ల అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని జీవీ మండిపడ్డారు. రోడ్డు పన్ను, చెత్త పన్ను అంటూ అన్ని రకాల పన్నులు వేయడమే కాక పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్కు రూ. 31 వరకు పెంచి, దేశంలోనే అత్యధిక ఇంధన ధరలు ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చింది జగన్ మోహన్ రెడ్డేనని విమర్శించారు. అంతేకాకుండా, గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని గంజాయి, గుట్కాలకు నిలయంగా మార్చి యువత జీవితాలతో ఆడుకున్నారని, నాసిరకం జే-బ్రాండ్ల మద్యంతో వేలాది మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. ఐదేళ్ళ జగన్ పాలనలో 34 వేల మంది కల్తీ మద్యానికి బలైన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, సామాజిక మాధ్యమాల వేదికగా మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తూ అబద్ధాలు ప్రచారం చేసే వారి తాట తీస్తామని ఆయన హెచ్చరించారు.
అదేవిధంగా కూటమి ప్రభుత్వ హయాంలో పోలీస్, వైద్య రంగాలలో వచ్చిన మార్పులను ఆయన ప్రశంసించారు. నేడు దేశంలోనే శాంతిభద్రతలలో ప్రథమ స్థానంలో నిలిపి, జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకోవడమే కాకుండా స్వయంగా ప్రధానమంత్రి చేత అభినందనలు అందుకునేలా ఏపీ పోలీసుల గౌరవాన్ని పెంచామని గుర్తుచేశారు. ప్రజలు వైఎస్సార్సీపీని ఘోరంగా ఓడించి, 90% సీట్లతో ఎన్డీయే కూటమికి అఖండ విజయాన్ని అందించారని, ఇప్పటికైనా జగన్ మోహన్ రెడ్డి వాస్తవాలను గ్రహించాలని హితవు పలికారు. చంద్రబాబు నాయుడిని గానీ, కూటమి ప్రభుత్వాన్ని గానీ విమర్శించే ఎలాంటి నైతిక అర్హత జగన్‌కు లేదని జీవీ ఆంజనేయులు తేల్చి చెప్పారు. సమావేశంలో జి డి సి సి బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు

## ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఘనస్వాగతం పలికిన ఎమ్మెల్యే పుట్టా



**కడప (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా జమ్మలమడుగులో నిర్వహించిన సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన శుభ సందర్భంగా కడప ఎయిర్పోర్ట్ నందు మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆత్మీయ స్వాగతం అందించారు.

## విద్యుత్ అధికారులతో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ సమీక్ష



- లైన్ లాసెస్ తగ్గింపుపై ప్రత్యేక దృష్టి: సీఎండీ పుల్లారెడ్డి

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పి. పుల్లారెడ్డి అధ్యక్షతన గుంటూరు జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గుంటూరు జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ చల్లా రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆపరేషన్స్ అధికారులు పాల్గొన్నారు.
సమీక్ష సమావేశంలో లైన్ లాసెస్ తగ్గింపు, రెవెన్యూ కలెక్షన్లు, సబ్‌స్టేషన్ పనుల పురోగతి, ఫీడర్ లెవెల్ సోలరైజేషన్, పీఎం సూర్య ఘర్, పీఎం-కుసుమ్, ఆర్డీఎస్ఎస్, జీఐఎస్ మ్యాపింగ్, ఎల్‌టీ నెట్‌వర్క్ అభివృద్ధి తదితర అంశాలపై సీఎండీ సమీక్ష నిర్వహించారు.
విద్యుత్ సరఫరాలో నాణ్యతను మరింత మెరుగుపరచాలని, వినియోగదారుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. లైన్ లాసెస్ తగ్గింపు, రెవెన్యూ వసూళ్లలో సర్కిల్ లక్ష్యాలను సాధించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ ఎ. మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టీవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ యస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## శంకరవిలాస్ బ్రిడ్జి పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** శంకరవిలాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల నిమిత్తం గుంటూరు టౌన్-1 సబ్ డివిజన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.
ఈ మేరకు పఠాన్ హుస్సేన్ ఖాన్ మరియు షేక్ ముస్తాక్ అహమ్మద్ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.
శుక్రవారం ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు బ్రాడీపేట 1వ లైన్ నుంచి 6వ లైన్ వరకు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ అంతరాయానికి సహకరించాలని అధికారులు కోరారు.

## తెనాలిలో పిఎన్‌టి ఎంప్లాయిస్ ఎన్నికల్లో పలువురు విజయం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి పి ఎన్ టి ఎంప్లాయిస్ ఎంఎస్సీ లిమిటెడ్ వార్షిక ఎలక్షన్ సందర్భంగా నాలుగు డైరెక్టర్ల ఎన్నికల ఏ1 ఫంక్షన్ హాల్లో జరిగింది.,24 సంవత్సరల తర్వాత జరిగిన ఎన్నికల్లో రెండు ప్యానెల్స్ అభ్యర్థులు హోరాహోరీగా రాష్ట్ర నలుమూల నుండి పోస్టల్ టెలిగ్రామ్ ఓటర్లు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీనియర్ ప్యానల్ లో సాయి ప్రసాద్ మరొకవైపు ఎక్స్ ఆర్మీ శ్రీనివాసరావు పోటీ పడ్డారు., రాష్ట్రకేంద్ర నాయకత్వాలు సీనియర్ ఫ్యానల్కు సపోర్ట్ చేశాయి, ఎక్స్ ఆర్మీ శ్రీనివాస్ గారి ప్యానల్ కు కామ్రేడ్ డి ఎస్ ఎన్ గారి ఆశీస్సులు, పోస్ట్మాన్ రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, శ్రీను, వసంతరావు యూనియన్లకు అతీతంగా మద్దతుగా నిలిచినారు. 24 సంవత్సరాల అభ్యర్థి ఎంత సీనియర్ను కూడా ఓడించారు.. ఎన్ యు జి డి ఎస్ అభ్యర్థి అయిన బి ప్రవీణ్ కు వ్యతిరేకంగా ఆ యూనియన్ రాష్ట్ర నాయకత్వం పనిచేసిన కానీ నవీన్ విజయ ఆపలేకపోయారు. అలాగే వివిధ సొసైటీలకు చెందిన సీనియర్ నాయకులు డిఎల్ కాంతారావు , తన్నీరు శ్రీనివాస్ బాబు ,బిఎంఎస్ నాయకులు కూడా ఎక్స్ ఆర్ మీ శ్రీనివాస్ గారి ప్యానెల్కు మద్దతు ఇచ్చాయి. టెలికాం కు సంబంధించిన ఒక డైరెక్టర్ పోస్ట్ కు టెలికామాల్ ఎంప్లాయిస్ అందరూ వచ్చి ఓటు వేశారు. అలాగే ఈ ప్యానెల్ కి కర్త,కర్మ,క్రియ అయినటువంటి శ్రీ దేవిరెడ్డి మాణిక్యరావు ,సూర్య, పోతురాజు ఎంతో ప్రయాసలకు వచ్చి ప్యానల్ను గెలిపించారు. . 4 డైరెక్టర్లు ఘన విజయం సాధించారు, రజాక్, ప్రవీణ్, ఏం రవికుమార్, సోమరాతు శ్రీనివాసరావు డైరెక్టర్గా ఎన్నికయ్యారు.. ఈ.నెల19న జరిగిన ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సోమరవుతూ శ్రీనివాసరావు , సెక్రెటరీగా మండలనేని శివయ్య, ట్రెజరర్ గా టి పోతురాజు, సోమశేఖర్ వైస్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



○ సెంట్రల్ జీఎస్టీ నూతన కమిషనర్ అరుణ్ రిచర్డ్ హామీ

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు చెందిన సెంట్రల్ ఎక్సైజ్, సెంట్రల్ ట్యాక్స్ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సీబీఐసీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నూతన కమిషనర్ అరుణ్ రిచర్డ్ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

గురువారం గుంటూరు కన్నావారితోటలోని సెంట్రల్ జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు టి. వివేకానంద, పి. వి. సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి. కోటేశ్వరరావు పాల్గొన్నారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు తరచూ అదాలత్‌లు నిర్వహించాలని వారు కమిషనర్‌ను కోరారు.

కార్యాలయానికి వచ్చే ప్రతి విశ్రాంత ఉద్యోగిని గౌరవంగా స్వాగతించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఉద్యోగికి వారి సర్వీస్ బుక్ జిరాక్స్ ప్రతులు అందజేయాలని సూచించారు. అలాగే సర్వీసులో ఉన్న ఉద్యోగి మరణించిన పక్షంలో వారి కుటుంబ సభ్యులకు తక్షణ ఉపాధి కల్పించాలని కోరారు.

ఫ్యామిలీ పెన్షన్ మంజూరులో తలెత్తుతున్న కుటుంబ వివాదాలను పరిష్కరించి, అర్హులైన వారికి వెంటనే ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేయాలని సంఘ నేతలు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయ నిర్వహణ కోసం జీఎస్టీ భవన్‌లో ప్రత్యేక గదిని కేటాయించాలని కోరారు.

ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ రిచర్డ్ మాట్లాడుతూ, పెన్షనర్ల సమస్యలకు తన కార్యాలయంలో తొలి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులను సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులతో సమానంగా గౌరవిస్తామని పేర్కొన్నారు. ప్రతి పెన్షనర్ తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. తన హయాంలో పెన్షనర్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తొలుత నూతన బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు సంఘ నేతలు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అడిషనల్ కమిషనర్ బి. లక్ష్మీనారాయణను కూడా కలిసి పెన్షనర్ల సమస్యలను వివరించారు.

# మానసిక ఒత్తిడి నియంత్రణకు పోలీసులకు ప్రత్యేక శిక్షణ



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** విధి నిర్వహణలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఎదుర్కొనే మానసిక ఒత్తిడిని తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే లక్ష్యంతో గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణ" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గుంటూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో జరుగుతున్న ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది విశేషంగా హాజరవుతున్నారు.

గుంటూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గత కొద్ది రోజులుగా జిల్లా పోలీస్ సిబ్బందికి యోగా, మెడిటేషన్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు పర్యవేక్షిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా హార్ట్ ఫుల్‌నెస్ ఇన్స్టిట్యూట్ నిపుణుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు "హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్" ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, డీజీపీ సూచనల మేరకు విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడులు, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు సీఐడీ, ఈగల్ విభాగాల అధికారులు, గుంటూరు రేంజ్ మరియు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది కలిపి సుమారు 300 మంది హాజరయ్యారు. హార్ట్ ఫుల్‌నెస్ ఇన్స్టిట్యూట్ తరపున గుంటూరు జోనల్ కోఆర్డినేటర్ రామ కోటేశ్వరరావు, గుంటూరు--బాపట్ల జిల్లాల కోఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొని విధి నిర్వహణలో ఒత్తిడి నియంత్రణ, కోప నియంత్రణ, సమయ నిర్వహణ, సవాళ్లను ఎదుర్కొనే విధానాలు, విధులను మరింత సమర్థంగా నిర్వహించే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి గుంటూరు రేంజ్ నోడల్ అధికారి ఏఆర్ డీఎస్పీ సంకురయ్య ఆధ్వర్యంలో, జిల్లా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి రెడ్డి నోడల్ అధికారిగా వ్యవహరించి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. అలాగే నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్లో కూడా హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణ శిబిరం నిర్వహించారు.

జిల్లా వ్యాప్తంగా హోంగార్డు స్థాయి నుంచి అదనపు ఎస్పీ స్థాయి అధికారుల వరకు వారి విధుల అవసరాలకు అనుగుణంగా ఈ హార్ట్ ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణను తప్పనిసరిగా అందించనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

# తిరుపతి వైపు వెళ్ళు భక్తులకు శుభవార్త

**నంద్యాల (జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల జిల్లా నుంచి తిరుపతి వైపు వెళ్ళు రైలు ప్రయాణికులకు, శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులకు, దక్షిణ మధ్య రైల్వే శాఖ శుభవార్త తెలిపినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం ఓ ప్రకటన లో తెలిపారు.

నంద్యాల మీదుగా తిరుపతికి సమ్మర్ స్పెషల్ వీక్లీ ట్రైన్ ను సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు నడుపనున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. తిరుపతి నుంచి చర్లపల్లికి కడప, ఎర్రగుంట్ల, నంద్యాల, నడికుడి మీదుగా వారంతపు ఎక్స్ ప్రెస్ ట్రైన్ ను 17443 ను 28 వ తేదీ నడుపనున్నారని. తిరుగు ప్రయాణంలో 17444 నెంబరు ట్రైన్ ను చర్లపల్లి నుంచి నడికుడి, నంద్యాల మీదుగా ఎర్రగుంట్ల, కడప మీదుగా తిరుపతి కి 29 వ తేదీ రెండు ట్రిప్పులు నడుప నున్నారని, ఈ ట్రైన్ తిరుపతి లో సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభం అయ్యి నంద్యాల కు రాత్రి 9:00 గంటలకు చేరుకొని చర్లపల్లి కి మరుసటి రోజు ఉదయం 8:30 కి చేరుకుంటుంది, తిరుగు ప్రయాణం లో చర్లపల్లి లో సాయంత్రం 4:20 కి ప్రారంభించి నంద్యాలకు అర్ధరాత్రి 12:00 గంటలకు చేరుకొని మరుసటి రోజు ఉదయం 7:30 కి చేరుకుంటుందని. నంద్యాల జిల్లా ప్రజలు, రైలు ప్రయాణికులు ఈ రైలును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# అభివృద్ధి అంటే చంద్రబాబు.. విధ్వంసం అంటే జగన్ : మంత్రి అచ్చెన్నాయుడు

- ○ ప్రజల కష్టాలకు కారణం జగన్ ఆర్థిక విధ్వంసం
- ○ జగన్‌ది విలువల రాజకీయాలు కాదు.. విష రాజకీయాలు
- ○ జగన్ పాలనలోనే రాష్ట్రం అరాచకాలకు అడ్డాగా మారింది
- ○ ప్రజలను మభ్యపెట్టేందుకు జగన్ కొత్త స్క్రిప్ట్
- ○ ఫ్యాక్షన్ రాజకీయాల వారసత్వం జగన్ కుటుంబానిదే
- ○ అమరావతిని నాశనం చేసిన జగన్‌కు రాజధానిపై మాట్లాడే హక్కు లేదు
- ○ గత ఐదేళ్ల విధ్వంస పాలనను ప్రజలు నేటికి మర్చిపోలేదు
- ○ చంద్రబాబు విజన్‌ను చూసి జగన్ భయపడుతున్నాడు
- ○ వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత ఐదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల అగాధంలోకి నెట్టి, అమరావతిని నిర్వీర్యం చేసి, పరిశ్రమలను పారదోలిన ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం ప్రజలను మోసం చేసే మరో రాజకీయ నాటకమని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి అంటే చంద్రబాబు.. విధ్వంసం అంటే జగన్ అని అందరికి తెలుసని అన్నారు. అమరావతిని నాశనం చేసి, మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టింది జగనేనని, రైతులను రోడ్డున పడేసి పెట్టుబడిదారులను పారగొట్టిన వ్యక్తికి రాజధాని గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఇప్పుడు మావిగన్ అంటూ మరో కొత్త డ్రామా మొదలుపెట్టి ప్రజలను మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం అంటే విజన్, దీర్ఘకాల ప్రణాళిక, మౌలిక సదుపాయాలు అవసరమని, కానీ జగన్ పాలనలో రాష్ట్రానికి అభివృద్ధి, పరిశ్రమలు, ఉద్యోగాలు ఏవీ రాలేదన్నారు. రుషికొండలో ప్యాలెస్‌లు కట్టుకుని వేల కోట్ల ప్రజాధనాన్ని విలాసాలకు ఖర్చు పెట్టిన జగన్ ఇప్పుడు అమరావతి నిర్మాణాలపై అవినీతి ఆరోపణలు చేయడం దొంగే ధర్మోపదేశం చేసినట్టుందని ఎద్దేవా చేశారు. తాత్కాలిక భవనాలను చూపిస్తూ శాశ్వత రాజధాని నిర్మాణాన్ని అవహేళన చేయడం జగన్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. గ్లాస్ ఫిట్టింగులు, డిజైన్లు, టెండర్లు అంటూ తప్పుడు లెక్కలు చదివి ప్రజలను భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారని, కానీ జగన్ హయాంలో జరిగిన అవినీతి, దోపిడీ, అప్పుల విధ్వంసం ప్రజలు మర్చిపోలేదన్నారు.

జగన్ తన కుటుంబ విషాదాలను కూడా రాజకీయ లాభం కోసం వాడుకోవడం దారుణమన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిజాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతోనే జగన్ అసహనంతో మాట్లాడుతున్నారని, దస్తగిరి అప్రూవర్‌గా కోర్టులో సాక్ష్యం చెబుతుండటం వల్లే జగన్‌కు భయం పట్టుకుందని వ్యాఖ్యానించారు. గుండెపోటు కథలు అల్లింది ఎవరు? సాక్ష్యాలను మాయం చేయడానికి ప్రయత్నించింది ఎవరు? సీబీఐ దర్యాప్తును అడ్డుకోవాలని చూసింది ఎవరు? అన్న విషయాలు రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. అసలు హత్య కేసు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు నాయుడు , నందమూరి బాలకృష్ణ , తెలుగుదేశం పార్టీపై అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

గొడ్డలి పార్టీ ఎవరిది? అని జగన్ అడుగుతున్నారని, రాష్ట్రంలో చిన్న పిల్లాడిని అడిగినా ఫ్యాక్షన్ రాజకీయాలు, హత్యా సంస్కృతి, రక్త చరిత్ర ఎవరిదో చెబుతాడన్నారు. సొంత చిన్నాన్న హత్య కేసులోనే దేశం మొత్తం ప్రశ్నలు అడుగుతుంటే వాటికి సమాధానం చెప్పకుండా శవ రాజకీయాలు చేయడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. తన తాత రాజారెడ్డి మరణాన్ని, తన కుటుంబ విషాదాలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం జగన్‌కే సాధ్యమయ్యిందన్నారు. హెలికాప్టర్ ప్రమాదాన్ని కూడా చంద్రబాబుతో ముడిపెట్టే స్థాయికి జగన్ దిగజారిపోయారని విమర్శించారు.

రాష్ట్రంలో జంగిల్ రాజ్ ఉందని జగన్ మాట్లాడటం విడ్డూరమన్నారు. జగన్ పాలనలోనే సోషల్ మీడియా పోస్టులకు కేసులు పెట్టారని, ప్రతిపక్ష నేతలపై దాడులు జరిగాయని, పోలీసులను రాజకీయ కక్షసాధింపులకు ఉపయోగించారని గుర్తు చేశారు. ఇప్పుడు చట్టం తన పని తాను చేసుకుంటుంటే తప్పుడు కేసులంటూ డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. కడపలో జరిగిన హత్య కేసులో కూడా నిజాలు బయటకు వస్తుండటంతో మీడియాపై, పోలీసులపై బురదజల్లుతున్నారని విమర్శించారు. జాతర గొడవను కూడా రాజకీయ రంగు పులిమి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గతంలో వివేకా హత్య కేసులో ఎలా కథలు మార్చారో, ఇప్పుడు కూడా అదే స్క్రిప్ట్‌తో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

పెట్రోల్, డీజిల్ ధరలు, రైతులు, మహిళలు, నిరుద్యోగులు అంటూ జగన్ మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని, కానీ ఆయన పాలనలో ఉద్యోగాలు రాలేదని, పరిశ్రమలు పారిపోయాయని, రోడ్లు గుంతలమయమయ్యాయని, రైతులు నష్టపోయారని, మద్యం,ఇసుక,భూముల మాఫియాలు రెచ్చిపోయాయని అన్నారు. ప్రజలపై వేల కోట్ల అప్పులు మోపి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన వ్యక్తి ఇప్పుడు సంక్షేమం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

మహిళలకు, రైతులకు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఐదేళ్లు ప్రచార పాలన మాత్రమే చేశారని విమర్శించారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడుతూ అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై దృష్టి పెడుతుంటే జగన్ మాత్రం అబద్ధాలు, విష ప్రచారం, కుట్ర రాజకీయాలతో కాలం గడుపుతున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు జగన్ అహంకారానికి గట్టి తీర్పు ఇచ్చారని, ఆ తీర్పు ఇప్పటికీ జగన్‌కు అర్థం కాలేదన్నారు. అందుకే ప్రతిరోజూ ప్రెస్‌మీట్లు పెట్టి అసహనం, అబద్ధాలు, ఆరోపణలతో కాలం గడుపుతున్నారని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి, శాశ్వత రాజధాని కావాలే గానీ జగన్‌లాంటి అరాచక, ప్రతీకార, విధ్వంస రాజకీయాలు అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# విదేశాల్లోనూ బీజేపీకి పెరుగుతున్న ఆదరణ





- ○ అమెరికాలో తెలుగు వారితో బీజేపీ భావజాల చర్చలు
- ○ కాలిఫోర్నియాలో బీజేపీ జాతీయత సందేశం
- ○ బీజేపీ సిద్ధాంతాలను వివరించిన వల్లూరు జయప్రకాశ్ నారాయణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో తెలుగు వారితో నిర్వహించిన "మీట్ ఒ గ్రీట్" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ పాల్గొని పార్టీ భావజాలం, దేశ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

అమెరికా పర్యటనలో భాగంగా నిర్వహించిన ఈ సమావేశంలో ప్రవాస తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు.

భారతీయ సంస్కృతి, జాతీయత భావం, బీజేపీ సిద్ధాంతాలపై ఈ కార్యక్రమం ద్వారా మరింత అవగాహన పెరిగిందని జయప్రకాశ్ నారాయణ తెలిపారు. విదేశాల్లో ఉన్న తెలుగు సోదరులు చూపిన ఆదరణ, అభిమానం ఆనందాన్ని కలిగించిందన్నారు.

కాలిఫోర్నియాలోని బిర్యానీ జంక్షన్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో భారత అభివృద్ధిలో ప్రవాస భారతీయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోందని వివరించారు.

"సబ్కా సాథ్ – సబ్కా వికాస్ – సబ్కా విశ్వాస్ – సబ్కా ప్రయాస్" లక్ష్యంతో బీజేపీ ముందుకు సాగుతోందని తెలిపారు. కార్యక్రమం చివరలో జై భారత్, జై బీజేపీ నినాదాలతో సభ ముగిసింది.

# తీవ్ర ఎండల్లో టీచర్ల శిక్షణలు వాయిదా వేయాలి

○ రాష్ట్ర ప్రభుత్వానికి ఫోర్టో విజ్ఞప్తి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న తీవ్ర వేసవి ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న మరియు నిర్వహించబోయే ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలను తక్షణమే వాయిదా వేయాలని ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఫోర్టో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయని, ప్రజలతో పాటు ఉపాధ్యాయులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో వివిధ రకాల శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం వల్ల ఉపాధ్యాయుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. శిక్షణలకు హాజరయ్యేందుకు ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోందని, వడగాల్పుల కారణంగా ముఖ్యంగా వృద్ధ ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో నిర్వహించబడుతున్న అన్ని రకాల టీచర్స్ ట్రైనింగ్స్‌ను ప్రస్తుతానికి వాయిదా వేసి, వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తర్వాత తిరిగి నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఫోర్టో నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించాలి : ఆప్తా

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా విభజన, ఉపాధ్యాయుల రేషనలైజేషన్, సర్ప్లస్ సర్దుబాటు, స్థానిక కేడర్ కేటాయింపు ప్రక్రియల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోషియేషన్ (ఆప్తా ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4A) ప్రకారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్‌తో పాటు కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ హక్కు కల్పించబడిందని సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెం. 2, సోషల్ వెల్ఫేర్ (ROR) శాఖ, తేదీ 09-01-2004 ద్వారా ఈ హక్కు అమలులోకి వచ్చిందన్నారు. అలాగే జీవో ఎంఎస్ నెం. 5, తేదీ 14-02-2003 ప్రకారం రోస్టర్ పాయింట్ల ఆధారంగా కల్పించిన రిజర్వేషన్ ప్రయోజనాలను అన్ని సేవా అంశాల్లో కచ్చితంగా రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

అయితే, కొన్ని సందర్భాల్లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను నియామకాల సమయంలో అమలైన "మెరిట్-కమ్-రోస్టర్" విధానాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం మార్కుల ఆధారంగా రూపొందిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు సీనియారిటీలో వెనుకబడిపోయి, జిల్లా కేటాయింపుల్లో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇది రిజర్వేషన్ యొక్క మౌలిక ఉద్దేశ్యానికి, రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

జిల్లా విభజన లేదా పరిపాలనా పునర్వ్యవస్థీకరణ పేరుతో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల రోస్టర్ పాయింట్లు, సీనియారిటీ హక్కులు, స్థానిక హోదా హక్కులు హరించరాదని సంఘం డిమాండ్ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్లు 77, 78 ప్రకారం ఉద్యోగుల సేవా హక్కులు, స్థానిక హోదా రక్షణకు చట్టబద్ధ భరోసా కల్పించబడిందని గుర్తు చేసింది.

తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న ఉపాధ్యాయులు, సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాల ఉపాధ్యాయుల పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా బలవంతపు స్థానచలనం చేయడం అన్యాయమని సంఘం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆప్తా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను మెరిట్-కమ్-రోస్టర్ విధానం ప్రకారం పునర్విమర్శించాలని, అసలు రోస్టర్ పాయింట్లను రక్షించాలని, కాన్సిక్వెన్షియల్ సీనియారిటీని పరిరక్షించాలని కోరింది. అలాగే జిల్లా విభజన, రేషనలైజేషన్, సర్ప్లస్ సర్దుబాటు ప్రక్రియల్లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు ఎటువంటి నష్టం కలగకుండా చూడాలని, స్థానిక కేడర్ కేటాయింపులో స్థానిక హోదా హక్కులను కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది.

సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల హక్కులను కాపాడేలా స్పష్టమైన మార్గదర్శకాలు వెంటనే జారీ చేయాలని ఆప్తా ప్రైమరీ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది.

# కార్మికులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : మంత్రి వాసంశెట్టి సుభాష్

**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర నిర్మాణ రంగ అభివృద్ధికి నైపుణ్యంతో కూడిన కార్మిక శక్తి అత్యంత అవసరమని, ఆ దిశగా నిర్వహిస్తున్న "అధునాతన నిర్మాణ కార్యకలాపాలు మరియు నిర్మాణ సాంకేతికతలపై జాతీయ వర్క్‌షాప్" కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. యువనేత, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించడం సంతోషకరమన్నారు.

అమరావతి నిర్మాణం, రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల విస్తరణ, రహదారులు, గృహ నిర్మాణ కార్యక్రమాల నేపథ్యంలో నైపుణ్యం కలిగిన కార్మికుల అవసరం మరింత పెరిగిందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిశ్రమలను ప్రోత్సహించకుండా మూసివేసే విధానాలు అమలయ్యాయని విమర్శించారు. సరైన పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు లేక యువత, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల బోర్డుకు వచ్చిన రూ. 2574 కోట్ల సెస్ నిధుల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు.

ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తుండటం నారా లోకేష్ దూరదృష్టికి నిదర్శనమన్నారు.




కార్మికులు కేవలం హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలంటే నైపుణ్యాభివృద్ధి అవసరమని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక టెక్నాలజీ వినియోగంపై కార్మికులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. చీూజ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ కార్మికులకు ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, భద్రతా ప్రమాణాలు, ప్రాక్టికల్ శిక్షణపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు.

"స్కిల్ ఇండియా మిషన్" లక్ష్యాలకు అనుగుణంగా కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్మిక శాఖ సేవలను డిజిటలైజేషన్ దిశగా తీసుకెళ్తూ కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల అమలు, ఆన్‌లైన్ సేవలు, డేటా మేనేజ్‌మెంట్‌లో సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు.

భవన నిర్మాణ కార్మికులకు ప్రసూతి సహాయం రూ. 20 వేల, వివాహ కానుక రూ. 20 వేల, సహజ మరణ సహాయం రూ. 60 వేల, అంత్యక్రియల సహాయం రూ. 20 వేల అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ పథకాల ద్వారా కార్మిక కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని తెలిపారు.

అసంఘటిత రంగ కార్మికుల కోసం "ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ కాంప్లెక్స్ (ఖూూజ)" కేంద్రాలను రాష్ట్రంలోని 15 ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా కార్మికులు ఒకేచోట చేరి ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు కాంట్రాక్టర్లు, కార్మికుల మధ్య సమన్వయం పెరుగుతుందని తెలిపారు. మహిళా కార్మికుల భద్రత, ఆరోగ్యం, గౌరవం కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

లేబర్ అడ్డాల ద్వారా ఈ-శ్రమ్, భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి సేవలు, సంక్షేమ పథకాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై సమాచారం అందిస్తున్నామని చెప్పారు. వర్క్‌షాప్ సందర్భంగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న పరిశ్రమ భాగస్వాములు, సంస్థలను మంత్రి అభినందించారు.

ఆధునిక, పారదర్శక, ప్రజాకేంద్రిత పరిపాలనకు నారా లోకేష్ చూపుతున్న దూరదృష్టి అభినందనీయమని మంత్రి కొనియాడారు. "కార్మికుల శక్తి దేశాభివృద్ధికి మూలస్తంభం.. ఆ శక్తికి నైపుణ్యం జోడిస్తేనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి" అనే దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

ఈ జాతీయ వర్క్‌షాప్ విజయవంతం కావాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకాంక్షించారు.

కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, భవన నిర్మాణ ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి, లేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ శాఖ కార్యదర్శి ఎం వి శేషగిరి బాబు, కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467